నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
1
గురువారం | నవంబర్ 14, 2024 | www.navatelangana.com

## పెళ్లి కుమార్తెకు పుస్తే, మట్టెలు అందజేత

**కాసిపేట :** మండల కేంద్రానికి చెందిన పేద మున్నూరు కాపు కులానికి చెందిన పెద్దపల్లి తిరుపతి, లక్ష్మీ దంపతుల కుమార్తె ప్రణీత వివాహానికి తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు మహాసభ కాచిగూడ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షులు చిట్ల సత్యనారాయణ సహకారంతో పుస్తే, మట్టెలు, పెళ్లి చీరలను అందించారు. బుధవారం కాసిపేటలోని పెళ్లి కూతురు ఇంటికి వెళ్లి మున్నూరుకాపు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మిట్ట లక్ష్మణ్ పటేల్, అధ్యక్షులు అగ్గి సత్తయ్య చేతుల మీదుగా అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మున్నూరు కాపు సంఘం యూత్ నాయకులు రాకం సంతోష్, మండల నాయకులు ఉష్కమల్ల గోపాల్, మడిపల్లి తిరుపతి, పెద్దపల్లి శంకర్, కాసు సురేందర్, గుర్రాల వేణు పాల్గొన్నారు.



## పాము కాటుతో మహిళ మృతి

నవతెలంగాణ-కుభీర్

మండల కేంద్రానికి చెందిన బొడ్డు యశోధ బుధవారం పాము కాటుతో మృతి చెందింది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం..యశోధ ఉదయం పత్తి ఏరడానికి చేనుకెళ్లింది. పత్తి ఏరుతున్న సమయంలో కాలుకు పాము కాటు వేసింది. తోటి కూలీల సాయంతో వెంటనే ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది.



# నియమించినా..జీతమివ్వరేం..?

- మినీలను మెయిన్ అంగన్‌వాడీలుగా గుర్తించిన ప్రభుత్వం
- రెండు నెలలు వేతనం అందించి..మళ్లీ పాత జీతమే జమ
- రాష్ట్రంలో 4వేలు..జిల్లాలో 270మందికి అన్యాయం
- అమలు చేయాలని మళ్లీ పోరుబాట పట్టిన సీఐటీయూ

**పోరాడి సాధించుకున్న ఫలాలు అంగన్‌వాడీలకు దక్కడం లేదు. మినీ అంగన్‌వాడీలను మెయిన్‌గా గుర్తించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో చేపట్టిన సుదీర్ఘ పోరాటం ఫలించింది. ప్రభుత్వాలు దిగివచ్చి మినీ అంగన్‌వాడీలను మెయిన్ అంగన్‌వాడీలుగా గుర్తిస్తూ జీవో జారీ చేశాయి. దీనికి అనుగుణంగా ప్రభుత్వం తొలి రెండు నెలలు మెయిన్ అంగన్‌వాడీలకు ఇచ్చే వేతనం అందించింది. కానీ తదనంతరం ఆర్థికశాఖలో అప్‌డేట్ కాలేదనే కారణంగా వేతనాన్ని నిలిపివేసింది. మినీ అంగన్‌వాడీలకు ఇచ్చే పాత వేతనమే మళ్లీ ఖాతాల్లో జమ చేస్తోంది. దీంతో మెయిన్ అంగన్‌వాడీలతో సమానంగా పనిచేస్తున్న తమకు ప్రభుత్వం అన్యాయం చేయడం సరికాదని మినీ అంగన్‌వాడీ టీచర్లు చెబుతున్నారు. ప్రభుత్వ నిర్ణయం పట్ల ఆగ్రహించిన అంగన్‌వాడీ ఉపాధ్యాయులు మళ్లీ పోరుబాట పట్టేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే వివిధ రూపాల్లో ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నా.. ప్రభుత్వాలు దిగొచ్చేలా సుదీర్ఘ ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తున్నారు.**

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

అంగన్‌వాడీ టీచర్లకు సమస్యల పరిష్కారంలో వెన్నుదన్నుగా ఉంటున్న సీఐటీయూ చేపట్టిన సుదీర్ఘ పోరాట ఫలితంగా దక్కిన ఫలాలు అంగన్‌వాడీలకు అందడం లేదు. పోరాటం ఫలించిందనే సంతోషంలో ఉండగానే ప్రభుత్వం మళ్లీ వారిని నిరాశకు గురిచేస్తోంది. గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యాన్ని పరిరక్షిస్తున్న అంగన్‌వాడీ ఉపాధ్యాయుల పట్ల ప్రభుత్వాలు నిర్లక్ష్య వైఖరి అవలంభిస్తున్నాయి. రాష్ట్రంలో పనిచేస్తున్న మినీ అంగన్‌వాడీ టీచర్లను ప్రభుత్వం 2024లో మెయిన్ అంగన్‌వాడీలుగా గుర్తిస్తూ అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో భాగంగా రాష్ట్రంలో 4వేల మంది..ఆదిలాబాద్ జిల్లాలో సుమారు 270మంది మినీ అంగన్‌వాడీ టీచర్లు మెయిన్ అంగన్‌వాడీలుగా గుర్తింపు పొందారు. అంతకుముందు మినీ అంగన్‌వాడీలకు ఇచ్చే రూ.7800వేతనానికి బదులు.. మెయిన్ టీచర్లకు అందిస్తున్న రూ.13600 చొప్పున అందించింది. ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరి నెలల్లో అందించిన ప్రభుత్వం తదనంతరం వేతనాన్ని నిలిపివేసింది. మార్చి నెలలో ఇవ్వకుండా ఏప్రిల్ నెలలో మళ్లీ పూర్తి వేతనాన్ని అందించింది. కానీ జూన్ నుంచి ఇప్పటి వరకు పెరిగిన వేతనం ఇవ్వకుండా పాత జీతమే(మినీ అంగన్‌వాడీలకు ఇచ్చే) వారి ఖాతాల్లో జమ చేస్తూ వస్తోంది. దీంతో ప్రభుత్వం మినీ అంగన్‌వాడీల పట్ల అలసత్వ ధోరణి ప్రదర్శిస్తోందని అంగన్‌వాడీ ఉపాధ్యాయులు మండిపడుతున్నారు. ప్రభుత్వ నిర్ణయానికి ఆర్థికశాఖ ఆమోదం లేకపోతే తొలుత పూర్తి వేతనం ఎందుకిచ్చినట్లు..? అని ఆ సంఘం నాయకులు ప్రశ్నిస్తున్నారు. వీరితో పాటు జిల్లాలో కొందరు అంగన్‌వాడీ సహాయకులు(హెల్పర్లు)కు కూడా ప్రభుత్వం టీచర్లుగా పదోన్నతి కల్పించింది. కానీ వీరికి కూడా వేతనం హెల్పర్లుకు ఇచ్చేనట్లు ఇవ్వడంతో వారు సైతం తీవ్ర నిరాశకు గురవుతున్నారు. వీరి సమస్యలను ఇప్పటికే ఉన్నతాధికారులకు నివేదించిన తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ (సీఐటీయూ అనుబంధం) నాయకులు జిల్లా స్థాయిలోనూ అధికారులకు వినతిపత్రాలు అందించడం.. పలుమార్లు ధర్నాలు చేపట్టడం వంటిని చేస్తున్నారు. మరింత ఉధృతమైన పోరాటానికి రూపకల్పన చేస్తున్నట్లు సంఘం నాయకులు చెబుతున్నారు.



యూనియన్ ఆధ్వర్యంలో మంత్రి సీతక్కకు వినతిపత్రం(ఫైల్)

**ప్రభుత్వం పూర్తి వేతనం అందించాలి : సునీత, ఉద్యోగోన్నతి పొందిన అంగన్‌వాడీ టీచర్**



ఇది వరకు మినీ అంగన్‌వాడీ టీచర్లను ప్రభుత్వం మెయిన్ అంగన్‌వాడీలుగా గుర్తించింది. తొలి రెండు నెలలు మాత్రమే పూర్తి వేతనం అందించింది. కానీ ఆరు నెలల నుంచి మళ్లీ పాత జీతమే జమ చేస్తోంది. ఇది సరికాదు. ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటూ పనిచేస్తున్న తమకు ప్రభుత్వం న్యాయం చేయాలి. పెంచిన వేతనాన్ని అమలు చేయాలి.



**వేతనం అందించే వరకు ఉద్యమం : కె.సునీత, అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు**

ప్రభుత్వం మినీ అంగన్‌వాడీలను మెయిన్ అంగన్‌వాడీలుగా గుర్తిస్తూ అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. వీటికి అనుగుణంగా మెయిన్ అంగన్‌వాడీలకు అందించే వేతనం కూడా రెండు నెలల పాటు అందించింది. కానీ మళ్లీ ఆరు నెలల నుంచి పాత జీతమే జమ చేస్తోంది. ఇది సరైన పద్ధతి కాదు. ఉన్నతాధికారులను అడిగితే ఆర్థికశాఖలో అప్‌డేట్ కాలేదని చెబుతున్నారు. ప్రభుత్వం త్వరగా స్పందించాలి. లేని యెడల ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తాం.

## టిప్పర్ బోల్తాపడి డ్రైవర్ మృతి





నవతెలంగాణ-ముథోల్

మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల దగ్గర బుధవారం రోడ్డుపై అదుపు తప్పి టిప్పర్ బోల్తా పడి తరోడ గ్రామానికి చెందిన డ్రైవర్ అల్తాప్(38) అక్కడికక్కడే మృతి చెందాడు. సీఐ మల్లేష్ పోలీస్ సిబ్బందితో ఘటన స్థలానికి హుటాహుటిన చేరుకున్నారు. టిప్పర్ కింద ఇరుకున్న అల్తాప్ మృతదేహాన్ని జేసీబీ తెప్పించి బయటకు తీసే ప్రయత్నం చేసినప్పటికీ సాధ్య పడలేదు. ఈ విషయం తెలుసుకున్న జాతీయ రహదారి నిర్మిస్తున్న అనుష కన్‌స్ట్రక్షన్ కంపెనీ ప్రతినిధులు ఘటన స్థలాన్నికి చేరుకున్నారు. మరో జేసీబీని తెప్పించినా టిప్పర్‌ను తీయడం సాధ్యపడలేదు. గమనించిన విలేకరులు, సిఐ వెంటనే అనుష కన్‌స్ట్రక్షన్ కంపెనీ మేనేజర్ విష్ణువర్ధన్‌రెడ్డితో ఫోన్‌లో మాట్లాడి వెంటనే హైడ్రాలిక్ క్రేన్ తెప్పించాలని కోరారు. వెంటనే స్పందించిన మేనేజర్ నిజామాబాద్ జిల్లా నవీపేట్ మండలంలో కొనసాగుతున్న జాతీయ రహదారి పనుల వద్ద ఉన్న క్రేన్‌ను ఘటన స్థలానికి రప్పించారు. హైడ్రాలిక్ క్రేన్ సాయంతో టిప్పర్‌ను పైకి లేపి మృతదేహాన్ని బయటకు తీశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## సర్వేలో కుటుంబ సభ్యుల వివరాలు స్పష్టంగా నమోదు చేయాలి

- మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్



నవతెలంగాణ-నస్పూర్

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే ప్రక్రియలో కుటుంబ సభ్యుల వివరాలు స్పష్టంగా నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని నస్పూర్ మున్సిపల్ పరిధిలో గల 11, 23 వార్డులలో సర్వే ప్రక్రియ కొనసాగుతున్న తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ప్రక్రియలో భాగంగా ఎన్యుమరేటర్లు తమకు కేటాయించిన బ్లాక్‌లోని అన్ని కుటుంబ సభ్యుల వివరాలు స్పష్టంగా నమోదు చేయాలని తెలిపారు. సర్వే కొరకు ప్రభుత్వం నిర్దేశించిన నమూనాలోని ప్రతి అంశానికి సంబంధించి వివరాలు సేకరించాలని, ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా నమోదు చేయాలని తెలిపారు. సామాజిక, ఆర్థిక, విద్య, వైద్య, రాజకీయ, కుల సర్వే ప్రక్రియలో భాగంగా పూర్తి స్థాయిలో కుటుంబ సభ్యుల వివరాలు సేకరించాలని తెలిపారు. సర్వే నిర్వహించే ప్రాంతంలో ముందు రోజు సంబంధిత కుటుంబ సభ్యులకు సమాచారం అందించాలని, ఇంటి యజమానులు అవసరమైన పత్రాలతో హాజరయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం 23వ వార్డులో కొనసాగుతున్న అమృత్ 2.0 పనులను పరిశీలించి త్వరితగతిన పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ సతీష్ పాల్గొన్నారు.

## బాసర ట్రిపుల్ ఐటీలో విద్యార్థుల ఆత్మహత్యలపై సమగ్ర విచారణ జరిపించాలి

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

బాసర ట్రిపుల్ ఐటిలో విద్యార్థుల వరుస ఆత్మహత్యలపై సమగ్రమైన విచారణ జరిపించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి దిగంబర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ విద్యాసంవత్సరం నుండి ట్రిపుల్ ఐటిలో విద్యార్థులు వరుసగా ఆత్మహత్యలు చేసుకుంటున్నారని తెలిపారు. సమస్యలను ప్రభుత్వం పరిష్కారం చేయకుండా, పూర్తిస్థాయి వైస్ ఛాన్సలర్‌ను నియమించకుండా తాత్సారం చేస్తోందన్నారు. నాణ్యమైన భోజనం అందించకుండా, కాంట్రాక్టర్లు ఏది ఇస్తే అదే తినేలాగా, చదువులలోనూ వసతులు కల్పించకుండా, నిధులు ఇస్తామని చెప్పి ఇవ్వకుండా విద్యార్థులు ఆందోళన బాట పట్టినా ప్రభుత్వాలు పట్టించుకోకుండా ఉండడం సరైంది కాదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిపక్ష నాయకుడిగా ఉన్న సందర్భంలో విద్యార్థుల ఆందోళన దగ్గరకు గోడ దూకి మరి లోపలికి వెళ్లి తాము అధికారంలోకి వస్తే సమస్యలు పరిష్కారం చేస్తామని చెప్పారని తెలిపారు. కానీ ఇప్పటి వరకు ఈ సమస్యలను రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పరిష్కారం చేయలేదని చెప్పారు. తక్షణమే రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేసి, నిధులిచ్చి బాసర ట్రిపుల్ ఐటిని అభివృద్ధి చేయాలని కోరారు.

## నేర రహిత సమాజ నిర్మాణానికి కృషి చేయాలి

నవతెలంగాణ-తాండూర్

నేర రహిత సమాజ నిర్మాణానికి పోలీసులకు సహకరించాలని ఎస్సై కిరణ్‌కుమార్ అన్నారు. పోలీస్‌స్టేషన్ పరిధిలోని కాసిపేట గ్రామంలో మంగళవారం సాయంత్రం పల్లెనిద్ర కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేర రహిత సమాజం కోసం కృషి చేస్తున్న పోలీసులకు సహకారం అందించాలని కోరారు. ప్రజల రక్షణ, భద్రత కల్పించడం పోలీస్ బాధ్యత అని, అందుకు యువకుల సహకారం అవసరమని తెలిపారు. గ్రామాల్లోకి కొత్త వ్యక్తులు, నేరస్తులు, షెల్టర్ తీసుకుంటే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. యువత చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడకూడదని, గంజాయి, మద్యం, డ్రగ్స్‌లకు దూరంగా ఉండాలని తెలిపారు. సమస్యలుంటే 100 నంబర్‌కి కాల్ చేయాలని సూచించారు. సైబర్ నేరాలు, మోసగాళ్ల ఫోన్‌కాల్స్, మెసెజ్, వాట్సాప్ కాల్స్‌లకు స్పందించవద్దని సూచించారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని తెలిపారు. గ్రామంలో స్వీయ రక్షణ కొరకు సీసీ కెమెరాలను అమర్చుకోవాలని నేర నిరూపణలో సీసీ కెమెరాలు కీలకపాత్ర పోషిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అశ్వ రమేష్, సంతోష్, మాజీ ఉపసర్పంచ్ నారాయణ పాల్గొన్నారు.

# సమగ్ర ఓటరు జాబితా రూపొందించాలి

- ఉమ్మడి జిల్లా ఓటరు జాబితా పరిశీలకులు కె.సురేంద్రమోహన్

నవతెలంగాణ-నిర్మల్

సమగ్ర ఓటరు జాబితాను రూపొందించాలని ఉమ్మడి జిల్లా ఓటరు జాబితా పరిశీలకులు కె.సురేంద్ర మోహన్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, ఉట్నూర్ సబ్ కలెక్టర్ యువరాజ్‌తో కలిసి ఆయన ఎన్నికల అధికారులు, సహాయ ఓటరు నమోదు అధికారులు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా రాజకీయ పార్టీల ప్రతినిధుల సమన్వయంతో స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించాలని ఆదేశించారు. రాజకీయ పార్టీలు ప్రతి పోలింగ్ కేంద్రానికి తమ ఏజెంట్లను నియమించాలని, జాబితా రూపకల్పనపై అధికారుల సమన్వయంతో పని చేయాలన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటరు జాబితాలో తమ వివరాలు నమోదు చేసుకునే విధంగా కృషి చేయాలని సూచించారు. జనవరి 1, 2025 నాటికి 18 సంవత్సరాలు నిండిన వారు ఓటరు నమోదుకు అర్హులని, పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో ఓటరు నమోదుపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని, స్వీప్ కార్యక్రమాలలో భాగంగా కళాశాలలో అంబాసిడర్లను నియమించి ప్రచారం నిర్వహించాలని తెలిపారు. అంతకుముందు కలెక్టరేట్‌కు వచ్చిన ఓటరు జాబితా పరిశీలకులకు కలెక్టర్ పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. సమావేశంలో ఆర్డీఓ లు రత్నాకళ్యాణి, కోమల్‌రెడ్డి, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు శ్రీనివాస్, రాజకీయ పార్టీల నాయకులు కొరిపల్లి శ్రావణ్‌రెడ్డి, సయ్యద్ హైదర్, జగన్మోహన్, రిజ్వాన్‌ఖాన్, గంగారాం, అజార్, రమేష్, నరేష్ పాల్గొన్నారు.




**ఆదిలాబాద్‌టౌన్ :** 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరిని ఓటరుగా నమోదు చేయాలని ఉమ్మడి జిల్లా ఓటరు జాబిత పరిశీలకులు సురేంద్ర మోహన్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో స్పెషల్ సమ్మరీ రివిజన్-2025 ఓటరు నమోదుపై కలెక్టర్ రాజర్షి షా, ఐటీడీఏ పీఓ ఖుష్బూ గుప్తాతో కలిసి సమావేశం నిర్వహించారు. ఆయా పార్టీల నాయకులతో ఓటరు నమోదు, అభ్యంతరాలు, సలహాలు సూచనలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన ప్రాంతాలలో స్వయం సహాయక సంఘాల ద్వారా అవగాహన కార్యక్రమాలు చేపట్టి, 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరిని ఓటరుగా నమోదు చేయాలన్నారు. జనవరి 1, 2025 నాటికి 18 సంవత్సరాలు నిండిన వారు ఓటరు నమోదుకు అర్హులని పేర్కొన్నారు. పోలింగ్ కేంద్రాల బూత్ స్థాయి అధికారులు ఈ నెల 28 వరకు ఓటరు నమోదు, మార్పులు, సవరణలు, తొలగింపులపై దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. ఈ నెల 9, 10 తేదీలలో అన్ని పోలింగ్ కేంద్రాలలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ శిబిరం నిర్వహించడం జరిగిందని తెలిపారు. తుది ఓటరు జాబితాను జనవరి 6, 2025 రోజున ప్రకటించడం జరుగుతుందని స్పష్టం చేశారు 18 సంవత్సరాల వయసు నిండిన ప్రతి ఒక్కరు ఓటరు జాబితాలో తమ వివరాలు నమోదు చేసుకునే విధంగా తమ వంతు సహాయ సహకారాలు అందించాలని తెలిపారు. పివిటిజి గ్రామాలలో ఓటరు నమోదుపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని, స్వీప్ కార్యక్రమాలు కళాశాలలో నిర్వహించి విస్తృత ప్రచారం చేపట్టాలని అన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ శ్యామలదేవి, ఆర్డీఓ వినోద్ కుమార్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, తహసీల్దార్లు పాల్గొన్నారు.



ఆదిలాబాద్‌టౌన్

## విద్యార్థిని ఆత్మహత్య కేసుపై ఎస్పీ నజర్

- రెండుసార్లు ట్రిపుల్ ఐటీకి వచ్చిన ఎస్పీ జానకి షర్మిల



నవతెలంగాణ-ముథోల్

బాసర ట్రిపుల్ ఐటీలో మూడు రోజుల క్రితం పియుసి రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న కేసు పోలీసులకు సవాల్‌గా మారింది. ఎస్పీ జానకి షర్మిల ఘటన జరిగిన రోజు రాత్రి ట్రిపుల్ ఐటీకి వెళ్లారు. ఘటన జరిగిన హాస్టల్ గదిని క్షుణ్ణంగా పరిశీలించి పలు వివరాలను అడిషనల్ ఎస్పీ అవినాష్ కుమార్, స్థానిక పోలీస్ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అలాగే తాజాగా బుధవారం రోజు కూడా ట్రిపుల్ ఐటీకి ఎస్పీ మరోసారి వెళ్లారు. అయితే విద్యార్థిని ఆత్మహత్య జరిగిన రోజు పోలీసులు విద్యార్థి సంఘ నాయకులపై వ్యవహరించిన తీరుతో పాటు విద్యార్థిని తల్లిదండ్రులు పోలీసులపై తీవ్ర ఆరోపణలు చేశారు. విద్యార్థిని ఆత్మహత్యపై అనుమానం ఉందని విద్యార్థిని కుటుంబ సభ్యులు ఆరోపించారు. దీంతో ఎస్పీ విద్యార్థిని ఆత్మహత్య కేసును సీరియస్‌గా తీసుకున్నారు. అందులో భాగంగానే రెండుసార్లు ట్రిపుల్ ఐటీని సందర్శించి కేసు పూర్వపరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థిని ఫోన్ డాటా విశ్లేషించాల్సి ఉందని సమాచారం. విద్యార్థిని వ్యక్తిగత సమస్యతోనే ఆత్మహత్యకు పాల్పడిందా లేక ఇంకేమైనా కారణాలు ఉన్నాయని అనే కోణంలో కూడా పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది. విద్యార్థిని రాసిన సూసైడ్ నోట్‌పై కూడా పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. పోలీస్ శాఖపై తీవ్ర విమర్శలు రావడంతో ఎస్పీ ఈ కేసును ప్రత్యేకంగా పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఘటన జరిగిన రోజు ఏబీవీపీ విద్యార్థి సంఘ నాయకులను కర్రలతో చితకబాదిన ట్రిపుల్ ఐటీ ప్రయివేట్ సెక్యూరిటీపై కేసులు కూడా నమోదు చేశారు. అంతేకాకుండా విద్యార్థుల ఆత్మహత్యపై అనుమానాలు ఉన్నాయని ట్రిపుల్ ఐటీ అధికారులపై విద్యార్థిని తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. దీంతో ఈ కేసులు ట్రిపుల్ ఐటీలోని పలువురు అధికారులపై కూడా కేసులు నమోదయ్యాయి. ఏదేమైనా ఈ కేసు పూర్తిగా కొలిక్కి వచ్చే విధంగా ఎస్పీ ప్రత్యేక దృష్టి సారించారు.

# ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం

నవతెలంగాణ-నస్పూర్

ఎస్సీ వర్గీకరణ విషయంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని జాతీయ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ అన్నారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేఖంగా అక్టోబర్ 25న భద్రాచలంలో చేపట్టిన పాద యాత్ర 21వ రోజు బుధవారం నస్పూర్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా జాతీయ మాల మహానాడు జిల్లా నాయకులు ఘనంగా స్వాగతం పలికారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్గీకరణ చెల్లదంటూ గతంలో సుప్రీంకోర్టు తీర్పునిచ్చిందని గుర్తు చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఎస్సీ వర్గీకరణ అవసరం లేదని, ఉప కులాలన్నీ విద్య, ఉద్యోగం, రాజకీయం తదితర రంగాల్లో సమానంగా ఉన్నాయని పేర్కొన్నారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును పున:పరిశీలించాలని తెలిపారు. రాజ్యాంగ మౌలిక సూత్రాలను దెబ్బకొట్టేలా న్యాయవ్యవస్థలు కూడా రాజకీయ ప్రభావితం కావడం దురదృష్టకరమని, మనువాద వారసులు దళితుల్ని విభజించి వారిని రాజ్యాంగ అధికారం నుండి దూరం చేయాలని చూస్తున్నట్లు తెలిపారు. రాజ్యాంగంలో అంటరాని కులాలు అన్నింటినీ కలిపి ఒకే సమూహంగా సామాజిక విక్షత కోణంలో ఆర్టికల్ 341లో అంబేద్కర్ రిజర్వేషన్లను పొందుపరిచారన్నారు. కానీ నేడు ఆర్థిక కోణాన్ని చూపుతూ మనువదులంతా ఏకమై దళితులను విభజించాలని చూడటం రాజ్యాంగ పూర్తికి విరుద్ధమని అన్నారు. విభజనకు వ్యతిరేకంగా ప్రతి ఒక్కరూ పోరాటాలను చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బైరి రమేష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాలితం శంకర్, తొగరి సుధాకర్, జైభీమ్ సైనిక్ దళ్ కన్వీనర్ ఆసాది పురుషోత్తం, జిల్లా అధ్యక్షుడు గజ్జెల్లి లక్ష్మణ్, జిల్లా ప్రధాన కార్యదర్శి సొల్లు శ్రీను, జిల్లా ఉపాధ్యక్షుడు జింజుపల్లి నర్సింగ్, వర్కింగ్ ప్రెసిడెంట్ నక్క శ్రీనివాస్, జిల్లా నాయకులు అనిల్, జిల్లా అధికార ప్రతినిధి తలారి రాజు, నియోజకవర్గ అధ్యక్షుడు గరిసే రామస్వామి, ప్రధాన కార్యదర్శి గుమ్మడి శ్రీనివాస్, నస్పూర్ పట్టణ ప్రధాన కార్యదర్శి ఐత పరమేశ్వర్, శ్రీరాంపూర్ ఏరియా అధ్యక్షుడు పుట్ట రవి, ఏరియా నాయకులు బండ ఓదెలు, సొల్లు కొమరయ్య, చిదురు సంతోష్, బొల్లం వెంకటి, వంగ శ్రీను, పర్లపెల్లి సారయ్య, చీమల రాయలింగు, జై భీమ్ సైనిక్ దళ్ జిల్లా అధ్యక్షులు ఎర్రోళ్ల నరేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి బి.శివ, నియోజకవర్గ అధ్యక్షులు కాటంరాజు, పట్టణ అధ్యక్షులు ఐతే రాజశేఖర్ పాల్గొన్నారు.



## పారిశుధ్య పనులు నిరంతరంగా చేపట్టాలి



నవతెలంగాణ-కాసిపేట

పారిశుధ్య పనులు నిరంతరంగా చేపట్టాలని జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వరరావు ఆదేశించారు. బుధవారం మండలంలోని ముత్యంపల్లి గ్రామ పంచాయతీని డీపీఓ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. పారిశుధ్య పనులను, నర్సరీని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రికార్డులు ఎప్పటికప్పుడు అప్డేట్ చేయాలని, పారిశుధ్య పనులు నిరంతరంగా చేయాలని, రోజు వారీగా సెగ్రిగేషన్ చేసి తడి, పొడి చెత్తను వేరుచేసి కంపోస్టు ఎరువు తయారు చేయించాలని తెలిపారు. పొడి చెత్తను రీసైక్లింగ్ కొరకు తగు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఈ నెల లోపు 100 శాతం ఇంటి పన్నులు వసూలు చేయాలని సూచించారు. అనంతరం కుల గణన జరుగుతున్న తీరును సర్వే జరుగుతున్న ప్రాంతానికి వెళ్లి పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి సఫ్దర్ అలీ పాల్గొన్నారు.

2

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక

ఆదిలాబాద్-నిర్మల్

గురువారం | నవంబర్ 14, 2024 | www.navatelangana.com


## కుమురం భీం కాలనీలో సర్వే చేపట్టాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సామాజిక ఆర్థిక రాజకీయ విద్య వైద్య కుల సర్వేను మావలలోని కుమురం భీం కాలనీలో కూడా చేపట్టాలని తుడుం దెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గోడం గణేష్ కోరారు. ఈ విషయమై బుధవారం కలెక్టర్ రాజర్షి షాను ఆదివాసులతో ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ తమ కాలనీలో దాదాపు 1500 కుటుంబాలు నివసిస్తున్నారని తెలిపారు. జీఓ నెంబర్ 18 ప్రకారం సమగ్ర కుటుంబ సర్వే చేసి ఆదివాసులను ఆదుకోవాలని విన్నవించారు. దీనికి కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు పేర్కొన్నారు. ఆయన వెంట నాయకులు గద్దల శంకర్, కొడప సోనేరావు, కొలం సేవా సంఘం గోడం రేణుక, ఆదివాసీ మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు ఉయిక ఇందిర ఉన్నారు.

## ఆర్ఐ జోక్యంతో యథావిధిగా సర్వే

నవతెలంగాణ-ముధోల్

మండలంలోని వడ్తల్ గ్రామంలో సమగ్ర కుటుంబ సర్వేను గ్రామస్తులు బుధవారం నిలిపివేయించారు. మా గ్రామంలో వరి కొనుగోలు కేంద్రం ప్రారంభించిన తర్వాతనే సమగ్ర కుటుంబ సర్వే చేయాలని డిమాండ్ చేశారు. దీంతో కొంతసేపు సర్వే నిలిచిపోయింది. ఈవిషయం తెలుసుకున్న మండల ఆర్ఐ నారాయణరావు పటేల్ వెంటనే గ్రామానికి చేరుకున్నారు. రైతులు, గ్రామస్తులతో మాట్లాడి సర్వేకు సహకరించాలని కోరారు. గ్రామస్తులను సముదాయించడంతో యథావిధిగా గ్రామంలో సర్వే కొనసాగింది.



## ధరలకు అనుగుణంగా ఛార్జీలు పెంచాలి

- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి దామెర కిరణ్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పెరిగిన ధరలకు అనుగుణంగా మధ్యాహ్నం భోజనం ఛార్జీలు పెంచాలని రోజుకి కనీసం ఒక్క విద్యార్థికి రూ.50 ఇవ్వాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి దామెర కిరణ్ డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలో ఎస్ఎఫ్ఐ కోకన్వీనర్ గణేష్ అధ్యక్షత జరిగిన సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాఠశాలల్లో మధ్యాహ్నం భోజనంలో విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందించాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న మధ్యాహ్నం భోజన బిల్లులను వెంటనే విడుదల చేయాలన్నారు. మన ఊరు మన బడి పేరుతో అసంపూర్తిగా ఉన్న నిర్మాణం పనులకు వెంటనే నిధులు మంజూరు చేసి నిర్మాణాన్ని పూర్తి చేయాలని అన్నారు. విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని, లేని పక్షంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సమరశీల పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు దీపక్, సురేష్, నరేష్, స్వామి పాల్గొన్నారు.

## పెండింగ్ వేతనాలు విడుదల చేయాలి



నవతెలంగాణ-ఖానాపూర్

సంక్షేమ హాస్టల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ వర్కర్లకు పెండింగ్‌లో ఉన్న వేతనాలను విడుదల చేయాలని ఐఎఫ్టీయూ జిల్లా అధ్యక్షుడు పునాదికారి రాజేష్ కోరారు. బుధవారం భారత కార్మిక సంఘాల సమాఖ్య(ఐఎఫ్టీయూ) ఆధ్వర్యంలో తహసీల్దార్ శివరాజ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎస్సీ ప్రీ మెట్రిక్, సంక్షేమ హాస్టల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ వర్కర్లకు ఐదు నెలల నుండి పెండింగ్‌లో ఉన్న వేతనాలను విడుదల చేయకపోవడంతో వారి కుటుంబాలు పరిస్థితి దయనీయంగా ఉందన్నారు. నెలనెలకు వేతనాలు రెగ్యులర్‌గా ఇవ్వాలని, కనీస వేతనం రూ.26000 ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. వర్కర్లకు సెలవులు ఇవ్వాలని, ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చిన సెలవులు కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ వర్గాలకు వర్తింపచేయాలన్నారు. సెలవులతో పాటు వేతనాలు ఇవ్వాలని, కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ వర్కర్లను రెగ్యులర్ చేయాలని అన్నారు. ఈపీఎఫ్, ఈఎస్ఐ, హెల్త్ కార్డు పెన్షన్ వర్తింపచేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి దుర్గం లింగన్న, వరలక్ష్మి, భాగ్యలక్ష్మి, కనకదుర్గ శాంతి, కిరణ్ పాల్గొన్నారు.

## విద్యార్థుల్లో సామర్థ్యం పెంపొందించాలి

నవతెలంగాణ-తాంసి

ప్రాథమిక స్థాయి విద్యార్థుల్లో చదవడం అలవాటు చేయడం ద్వారా వారిని స్వతంత్ర పాఠకులుగా తీర్చిదిద్దవచ్చని జిల్లా విద్యాధికారి ప్రణీత అన్నారు. బుధవారం మండలంలోని కప్పర్ల మండల ప్రాథమిక పాఠశాలలో రూమ్ టు రీడ్ ఇండియా వారు ఏర్పాటు చేసిన మోడల్ లైబ్రరీని పాఠశాలలో ఎంఈఓతో కలిసి ప్రారంభించారు. విద్యార్థులకు చదువు పట్ల తీసుకోవాల్సిన సూచనలు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాధికారి మాట్లాడుతూ జిల్లాలో ప్రతి మండలానికి ఒక రూమ్ టు రీడ్ ఇండియా ట్రస్ట్, యూఎస్ఏఐడీ సహకారంతో సిరి కార్యక్రమంలో భాగంగా ఎఫ్ఎల్ఎన్‌కు అనుబంధంగా విద్యాశాఖ సమన్వయంతో మండల మోడల్ లైబ్రరీని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వివిధ రకాల రంగురంగుల కథల పుస్తకాలను, పఠన సామాగ్రి ద్వారా విద్యార్థుల్లో విద్య సామర్థ్యాలు పెంపొందించవచ్చని తెలిపారు. మండల కేంద్రంలోని ప్రైమరీ పాఠశాలలో గోడలపై విద్యార్థులకు ఉపయోగపడే వివిధ రకాల బొమ్మలు వేసిన ఉపాధ్యాయురాలు కవితను అభినందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు షంశీర్ ఖాన్, ఎంఈఓ శ్రీకాంత్, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్, గ్రామస్తులు, నాయకులు, ఉపాధ్యాయులు, రూమ్ టు రీడ్ టీం సభ్యులు మహేందర్, చంద్రశేఖర్, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సమాన పనికి సమాన వేతనం ఇవ్వడం లేదు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మహిళలు పురుషులతో సమానం అని చెబుతున్నారే తప్ప సమాన పనికి సమాన వేతనం ఇవ్వడం లేదని భారత జాతీయ మహిళా సమాఖ్య(ఎన్ఎఫ్ఐడబ్ల్యూ) రాష్ట్ర సహాయ కార్యదర్శి ముడుపు నళిని రెడ్డి అన్నారు. బుధవారం సీపీఐ పార్టీ కార్యాలయంలో ఎన్ఎఫ్ఐడబ్ల్యూ రాష్ట్ర నిర్మాణ మహాసభలు, జాతీయ మహాసభలు, సభ్యత్వం తదితర అంశాలతో కూడిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ముడుపు నళిని రెడ్డి మాట్లాడుతూ పార్లమెంట్‌లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ ప్రకటించిన నేటికి దాన్ని అమలు చేయలేదని, అందులో చిన్నచిన్న సవరణలు చేసి వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. మహిళలు వంటింటికే పరిమితం అవుతున్నారని వారిని గుర్తించి కుటీర పరిశ్రమలు పెట్టుకునేల ప్రోత్సాహం అందించాలన్నారు. అదే విధంగా ఈనెల 23, 24 తేదీల్లో హైదరాబాద్ రాష్ట్ర నిర్మాణ మహాసభలు, డిసెంబర్ 26 నుంచి 28 వరకు ఢిల్లీలో జాతీయ మహాసభలు ఉంటాయని తెలిపారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎన్ఎఫ్ఐడబ్ల్యూ కార్యదర్శి అమీనా ఖాన్, జిల్లా వర్కింగ్ కమిటీ సభ్యురాలు కృష్ణవేణి, కోశాధికారి ఆత్రం సంగీత, పుష్ప, రాజవ్వ, షబానా ఖాన్ పాల్గొన్నారు.

## గ్రూప్-3 పరీక్షకు ప్రత్యేక బస్సులు

నవతెలంగాణ-నిర్మల్

ఈ నెల 17,18 తేదీలలో జరిగే గ్రూప్3 పరీక్షలకు నిజామాబాద్, ఆదిలాబాద్, ఖానాపూర్, భైంసా నుండి నిర్మల్‌కు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ ప్రతిమా రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రతి బస్టాండ్‌లో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశామన్నారు. తమతమ సెంటర్ల వివరాలను తెలుసుకునేందుకు హెల్ప్ డెస్క్ సాయం అందిస్తుందన్నారు. గ్రూప్3 పరీక్ష అభ్యర్థులు ప్రత్యేక బస్సులను సద్వినియోగించుకోవాలన్నారు. ఇతర వివరాలకు 9492767879లో సంప్రదించాలన్నారు.

# నిర్మల్ మున్సిపాలిటీలో ఏసీబీ దాడులు

- రూ.15 వేలు లంచం తీసుకుంటు పట్టుబడ్డ జూనియర్ అసిస్టెంట్



పట్టుబడ్డ జూనియర్ అసిస్టెంట్‌కు సిలికాన్ టెస్టు నిర్వహిస్తున్న ఏసీబీ అధికారులు

నవతెలంగాణ-నిర్మల్

నిర్మల్ మున్సిపాలిటీలో బుధవారం ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించారు. మున్సిపాలిటీలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న షాకీర్ ఖాన్ రూ.15 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. నిర్మల్ మున్సిపాలిటీలో తాత్కాలిక బిల్ కలెక్టర్‌గా పనిచేస్తున్న చందల భరత్ సర్వీసులు రెగ్యులర్ అయ్యాయి. ఈ నేపథ్యంలో ఆయన సర్వీస్ బుక్‌లో రెగ్యులరైజేషన్ వివరాలు నమోదు చేయాలని షాకిర్ ఖాన్ కోరారు. దీనికి షాకీర్ ఖాన్ రూ.20 వేలు డిమాండ్ చేశాడు. దీనికి భరత్ నిరాకరించాడు. దీంతో ఈ వివరాల నమోదుకు చాలా రోజులగా వేధించసాగాడు. ఈ క్రమంలో చివరికి రూ.15 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. విసుగెత్తిన భరత్ ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. దీంతో బుధవారం ఉదయం షాకీర్ ఖాన్‌ను లంచం తీసుకుంటున్న సమయంలో రెడ్ హ్యాండెడ్‌గా ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి, సీఐలు కృష్ణ కుమార్, కిరణ్ రెడ్డి పట్టుకున్నారు. ఈ మేరకు విచారణ చేపడుతున్నట్లు ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి తెలిపారు. సొంత కార్యాలయంలోనే పనిచేస్తున్న సిబ్బంది పై లంచాలకు అధికారులు ఆశ పడుతుంటే తమ పరిస్థితి ఏంటని సామాన్య ప్రజలు చర్చించుకుంటున్నారు.

# సమన్వయంతో స్పష్టమైన ఓటరు జాబితా

- ఉమ్మడి జిల్లా ఓటరు జాబిత పరిశీలకులు సురేంద్ర మోహన్



పోలింగ్ కేంద్రంలో బీఎల్‌ఓలతో మాట్లాడుతున్న ఉమ్మడి జిల్లా ఓటరు జాబిత పరిశీలకులు మోహన్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా రాజకీయ పార్టీల ప్రతినిధుల సమన్వయంతో స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించాలని ఉమ్మడి జిల్లా ఓటరు జాబిత పరిశీలకులు సురేంద్ర మోహన్ అన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు ప్రతి పోలింగ్ కేంద్రానికి తమ ఏజెంట్లను నియమించాలని సూచించారు. ఓటరు నమోదు ప్రక్రియను పరిశీలించేందుకు బుధవారం జిల్లాకు ఆయన వచ్చారు. ముందుగా కలెక్టర్ రాజర్షి షా ఆయనకు పెన్‌గంగా భవనంలో పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అనంతరం పట్టణంలోని శాంతినగర్ పీఎస్ నంబర్ 283, ప్రభుత్వ డిగ్రీకళాశాల, సంజయ్ నగర్ పీఎస్ నెంబర్ 212, ప్రాథమికోన్నత పాఠశాల పోలీస్ లైన్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల్లో ఓటరు నమోదు ప్రక్రియను పరిశీలించారు. బీఎల్‌ఓలను ఓటరు నమోదు ఎలా చేస్తున్నారు, ఇప్పటి వరకు ఎన్ని నమోదయ్యాయి, తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఓటరు జాబిత పరిశీలకులు సురేంద్ర మోహన్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఒకటి జనవరి 2025 నాటికి 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరిని ఓటరుగా నమోదు చేయాలన్నారు. కొత్త ఓటర్లు, సవరణలు, తొలగింపులు, అభ్యంతరాలు, దరఖాస్తులకు ఈనెల 28వ తేది వరకు అవకాశం ఉందన్నారు. జిల్లాలో ఓటరు నమోదు ప్రక్రియ సజావుగానే సాగుతుందని తెలిపారు. ఫీల్డ్‌లో కూడా బీఎల్‌ఓలు మంచిగా పని చేస్తున్నారన్నారు. అయితే కొన్ని బూత్ వద్ద ఆయా రాజకీయ పార్టీలు వారి బూత్ లెవల్ అసిస్టెంట్లను నియమించాలేదని తెలిసిందన్నారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలు జరిగాయని ఓటరు జాబితాపై పార్టీలకు పూర్తి అవగాహన ఉంటుందన్నారు. అందులో వారి దృష్టికి వచ్చిన సమస్యలను దరఖాస్తు రూపంలో అందించాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామల దేవి, ఐటీడీఏ పీఓ ఖుష్బూ గుప్తా, ఆర్డీఓ వినోద్ కుమార్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



నవతెలంగాణ-కడెం

పేదల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో 31మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదలకు పెద్దపీట వేస్తుందన్నారు. కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకం వల్ల పేదలకు ఆర్థికంగా ఎంతో మేలు జరుగుతుందని తెలిపారు. ప్రజలకు ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు. అంతకు ముందు మండలంలోని పెద్దూర్ గ్రామంలో నిర్వహిస్తున్న సమగ్ర సర్వేను ఎమ్మెల్యే పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఎలాంటి తప్పులు లేకుండా చూడాలని అధికారులు, ఎన్యుమరేట్లకు సూచించారు. అలాగే ఎంపీడీఓ, ఎంపీఓ ఉన్నత అధికారుల పర్యవేక్షణలో సమగ్ర సర్వేను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. తదనంతరం మండలంలోని కొండుకూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు గొద్దూరు శంకర్ కుమారుడు స్వామీ లాస్యశ్రీ వివాహ వేడుకలకు ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు తుమ్మల మల్లేష్ యాదవ్, నిర్మల్ జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు పొద్దుటూరి సతీష్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ శైలజ రమేష్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు తారి శంకర్, సింగల్ విండో డైరెక్టర్లు గొల్ల వెంకటేష్, పడిగెల భూషణ్, నచ్చన్ ఎల్లాపూర్ మాజీ సర్పంచ్ బొడ్డు గంగన్న, నిర్మల్ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు దుర్గ భవాని, కడెం పట్టణ అధ్యక్షులు వాజీద్ ఖాన్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు తాళ్లపెల్లి రమేష్, సుధాకర్, రహీం, రాజన్న, పెంబట్ల శ్రీధర్, ఖనాపూర్ నియోజకవర్గం సోషల్ మీడియా కోఆర్డినేటర్ రెంకల శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలి

నవతెలంగాణ ఆదిలాబాద్ రూరల్

దివ్యాంగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ హ్యాండి క్యాప్ హెల్పింగ్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డికి వినతిపత్రం అందించారు. తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర మంత్రి సీతక్కని కలిసి హైదరాబాద్‌లో ధర్నా తలపెట్టిన నేపథ్యంలో శ్రీకాంత్ రెడ్డికి ఆయన నివాసంలో బుధవారం మర్యాద పూర్వకంగా కలిసి తమ సమస్యలను విన్నవించారు. ఈ సందర్భంగా గత ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలకు, హెల్త్ కార్డులో పేర్లు ఉన్న పిల్లలకు పెన్షన్లను తొలగించడం జరిగిందన్నారు. ఆదిలాబాద్‌లో వారికి నివాస స్థలాలను కేటాయించి కాలనీ నిర్మించి ఇవ్వాలని కోరారు. ఈ విషయమై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి సీతక్కకి వివరిస్తానని ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి వారికి భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు మహమ్మద్ ఇమ్రాన్, ఫైసల్ అహ్మద్, తార ఉషన్న, షేక్ ఖలీఫ్, సయ్యద్ సాజిద్ పాల్గొన్నారు.



## బెల్లూరి అయ్యప్ప ఆలయంలో మాలధారణ

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

మండలంలోని బెల్లూరి అయ్యప్ప ఆలయ కమిటీ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ప్రతి సంవత్సరం బెల్లూరి అయ్యప్ప ఆలయంలో రెండు సార్లు పడిపూజలో ఆర్థిక నివేదికను సమర్పించి కార్యక్రమాల గురించి చర్చించడం జరుగుతుందన్నారు. రెండవసారి నవంబర్ నెలలో కార్తీక మాసం ముందు ఆర్థిక నివేదికను సమర్పించి కార్తీక మాసం నుంచి మాల ధారణ కార్యక్రమం, ఆరాట్టు పడిపూజ, మన బెల్లూరి అయ్యప్ప ఆలయంలో నిర్వహించే పడిపూజలు, సుబ్రహ్మణ్య షష్టి దీపోత్సవం సంక్రాంతి ఉత్సవాలు గురించి సర్వసభ్య సమావేశంలో నిర్ణయిస్తామన్నారు. కార్యక్రమంలో కొందరు ఒక కమిటీని సృష్టించుకుని లెక్కలు చెప్పలేరని, అడుగుతే బెదిరిస్తున్నారని గుడి ప్రాసస్తిని దెబ్బతీసే విధంగా పేపర్ స్టేట్మెంట్ ఇవ్వడంతో పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు.

## సమగ్ర సర్వేకు సహకరించాలి

నవతెలంగాణ-నార్నూర్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సామజిక, ఆర్థిక, విద్య, ఉపాధి రాజకీయ, కుల సర్వేకు మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు అందరూ సహకరించాలని ఎంపీడీఓ జవహర్ లాల్ కోరారు. బుధవారం మండల కేంద్రంలోని దుర్గానగర్, సేవాలాల్ నగర్, అంబేద్కర్ నగర్, జీన్‌గూడ, ముస్లింగూడ, అన్నబావుసాటే నగర్‌తో పాటు గంగాపూర్, తాడిహత్నూర్‌లో తిరుగుతూ ఎన్యుమరెటర్లు సర్వే చేస్తున్న తీరును పరిశీలించారు. సర్వేపై ప్రజలు ఎలాంటి అపోహలు పెట్టుకోవద్దని పూర్తి వివరాలు సేకరించాలని సర్వేకు అందరూ సహకరించాలన్నారు. ఎలాంటి తప్పులకు అస్కారం లేకుండా ఎన్యుమరేటర్లు యాజమాని చెప్పిన వివరాలను నమోదు చేయాలన్నారు. ఏ ప్రాంతానికి వెళ్తారో ముందు రోజు వారికి సమాచారం అందించాలన్నారు. ఆయన వెంట సర్వేలో పంచాయతీ కార్యదర్శి మోతిరాం, రాజు, శేఖర్, ఎన్యుమరెటర్లు, ఉపాధ్యాయులు, ఆయా శాఖల అధికారులున్నారు.

## జాతీయస్థాయి పోటీలకు జిల్లా క్రీడాకారులు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మహబూబ్ నగర్ జిల్లాలో అక్టోబర్ 28, 29, 30 తేదీల్లో జరిగిన ఖోఖో జూనియర్ రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా విద్యార్థులు పాల్గొన్నారు. పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన నలుగురు క్రీడాకారులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఉత్తరప్రదేశ్‌లోని ఆలీఘాట్ జిల్లాలో ఈనెల 25 నుంచి 29 వరకు జరిగే జాతీయ స్థాయి పోటీల్లో ఎంపికైన క్రీడాకారులు రితీష్ నాయక్, రాథోడ్ ఆకాష్, రాథోడ్ ప్రదీప్, సంపత్ ఈ నలుగురు విద్యార్థులు జిల్లా గురుకుల కళాశాలకు చెందినవారు పాల్గొనున్నారు. ఈ విద్యార్థులు 14వ తేదీ నుండి 22వ తేదీ వరకు మహబూబ్ నగర్‌లో జరిగే జాతీయస్థాయి కోచింగ్ క్యాంప్‌కి వెళ్లనున్నారు. తెలంగాణ టీంకు జిల్లా విద్యార్థులు ప్రాతినిధ్యం వహించడం గర్వకారణమని కళాశాల ప్రిన్సిపాల్ అనిల్ కాంబ్లీ అన్నారు. పోటీలకు ఎంపికైన క్రీడాకారులను బుధవారం కళాశాలలో ప్రిన్సిపాల్‌తో పాటు పీడీ ప్రతాప్, శేఖర్, రంజిత్, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు. జాతీయ స్థాయిలోనూ తమ ప్రతిభను కనబర్చలని ఆకాంక్షించారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ



నవతెలంగాణ-నేరడిగొండ

బోథ్ నియోజకవర్గంలోని ఆయా మండలాలకు చెందిన 20 మంది లబ్ధిదారులకు బుధవారం మండల కేంద్రంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే అనిల్ జాధవ్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద మధ్య తరగతి కుటుంబాలు అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరి చికిత్స పొందితే ఆ బిల్లులను అందిస్తే సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సాయం అందిస్తామన్నారు.

## రైతుల సంక్షేమానికి కృషి చేయాలి

నవతెలంగాణ-ఉట్నూర్



నూతనంగా ఎన్నికైన జైనూర్ మార్కెట్ కమిటీ సభ్యులు రైతుల సంక్షేమానికి నిరంతరం కృషి చేయాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నూతనంగా ఎన్నికైన జైనూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కుడ్మేత విశ్వనాథ్, వైస్ చైర్మన్ బానోత్ జైవంతరావు, సభ్యురాలు తొడసం రాధాబాయి ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువాతో సత్కరించి ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తుందన్నారు. నూతనంగా ఎన్నికైన మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్, సభ్యులు నిత్యం రైతులకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. పార్టీ కోసం కష్టపడ్డా ప్రతి ఒక్కరికి సముచిత స్థానాన్ని కల్పిస్తామన్నారు.

## మున్సిపాలిటీకి నిధులు మంజూరు చేయాలి

నవతెలంగాణ-ఖానాపూర్



ఖానాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని అభివృద్ధి పనులకు నిధులను మంజూరు చేయాలని బుధవారం హైదరాబాదులోని ఆయా శాఖల అధికారులను మున్సిపల్ పాలకవర్గం సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసింది. సీడీఎంఏ డైరెక్టర్ శ్రీదేవిని కార్యాలయంలో కలిసి సమస్యలు విన్నవించారు. ఖానాపూర్ పట్టణంలోని జరుగుతున్న పలు అభివృద్ధి పనులకు నిధులను మంజూరు చేయాలని కోరారు. అలాగే సీడీఎంఏ జాయింట్ డైరెక్టర్ ఖానాపూర్ పట్టణవాసి బోనగిరి శ్రీనివాసరావును మర్యాదపూర్వకంగా కలిశారు. నూతనంగా మున్సిపాలిటీలో పారిశుధ్య పనులు నిర్వహించడానికి 21 మంది కార్మికులకు అనుమతి ఇవ్వాలని కోరారు. అంతేకాకుండా వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ లక్ష్మీబాయిని కలసి అమృత్ టు స్కీం కింద మంజూరు అయిన వాటర్ ట్యాంక్ నిర్మాణానికి వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో స్థలం కేటాయించాలని కోరారు. ఇందులో మున్సిపల్ చైర్మన్ రాజుర సత్యం, కమిషనర్ మనోహర్ గౌడ్, నాయకులు పరిమి సురేష్, అమానుల్లా ఖాన్ ఉన్నారు.

## బాలల దినోత్సవ సమావేశం నిర్వహించాలి

నవతెలంగాణ-నిర్మల్ రూరల్

జిల్లాలో ఈ 14న బాలల దినోత్సవం సందర్భంగా అన్ని ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల్లో ఉపాధ్యాయుల, తల్లిదండ్రుల సమావేశాలను విధిగా నిర్వహించాలని డీఈఓ రవీందర్ రెడ్డి ప్రకటనలో తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులను సమావేశాలకు హాజరయ్యేలా చూడాలని ఉపాధ్యాయులకు సూచించారు. సమావేశాల్లో విద్యార్థుల హాజరు శాతం మెరుగుపడేలా తల్లిదండ్రులకు వివరించాలన్నారు.

## ఢిల్లీకి డైరెక్టర్ కాత్లే శ్రీధర్ బృందాలు

నవతెలంగాణ-ఇచ్చోడ

మండల పరిధిలోని దుబార్‌పేట్ గ్రామానికి చెందిన ఆదివాసీ సకల కళా సంక్షేమ సంఘం డైరెక్టర్, ప్రముఖ ఆదివాసీ కళాకారుడు కాత్లే శ్రీధర్ బృందాలు ఢిల్లీకి బయలుదేరాయి. ఈనెల 13 నుంచి 15వ తేది వరకు ఢిల్లీ పార్లమెంట్ హౌస్‌లో నిర్వహిస్తున్న స్వాతంత్ర్య సమరయోధుడు భగవాన్ బిర్సాముండా జయంతి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయనతో పాటు ఆదివాసీ సకల కళా సంక్షేమ సంఘం కార్యదర్శి కాత్లే ఆనంద్, సభ్యులు చిట్టిబాబు, శాంత కుమారి ఉన్నారు.

నవతెలంగాణ
కుమురంభీం ఆసిఫాబాద్
గురువారం | నవంబర్ 14, 2024 | www.navatelangana.com



## రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

నవతెలంగాణ-కాగజ్‌నగర్



సిర్పూరు నియోజకవర్గంలోని రైతులకు చేదోడు వాదోడుగా ఉంటూ వారి సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు సూచించారు. నియోజకవర్గంలోని ఆయా మండలాలకు నూతనంగా వచ్చి బాధ్యతలు స్వీకరించిన వ్యవసాయాధికారులు బుధవారం ఎమ్మెల్యే నివాసానికి వచ్చి కలిశారు. ఈ సందర్భంగా వారు ఎమ్మెల్యేను సన్మానించారు. సమర్థవంతంగా బాధ్యతలు నిర్వర్తిస్తూ రైతుల మన్ననలు పొందాలని వారికి ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో ఏడీఏ మనోహర్, వ్యవసాయాధికారులు రామకృష్ణ, గిరీషన్, కార్తీష, ప్రేమలత, మనీషా, నాగరాజు పాల్గొన్నారు.

## పోలీసుల కుటుంబాలకు అండగా ఉంటాం

నవతెలంగాణ-ఆసిఫాబాద్



పోలీసు కుటుంబాలకు అండగా ఉంటామని ఎస్పీ డీవీ.శ్రీనివాసరావు అన్నారు. ఇటీవల గుండెపోటుతో మరణించిన ఏఎస్ఐ గులాం మక్సూద్ హైమద్ కుటుంబానికి పోలీస్ కో-ఆపరేటివ్ సొసైటీ చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తున్న పోలీస్ సిబ్బందికి అనుకోని సంఘటనలు ఏమైనా జరిగితే వారి కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు. పోలీసులు వారి ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలన్నారు. మరణించిన ఏఎస్ఐ కుటుంబంలో అర్హత గల వారికి ఉద్యోగం వచ్చేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్ఐ అంజన్న, జిల్లా పోలీస్ కో-ఆపరేటివ్ సొసైటీ ఇన్‌చార్జి జాపర్, బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## పారిశుధ్య నిర్వహణలో ప్రజలు కలిసి రావాలి

- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో పారిశుధ్య నిర్వహణలో ప్రజలు కలిసి రావాలని అప్పుడే పారిశుధ్య నిర్వహణ సాధ్యమవుతుందని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. బుధవారం జిల్లాలోని ఆసిఫాబాద్ మున్సిపాలిటీలోని జనకాపూర్ వార్డు మేకల వాడలో పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలోని వార్డులలో పారిశుధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని సూచించారు. మురుగు కాలువలలో పూడికను ఎప్పటికప్పుడు తొలగించాలని, వార్డులలో అంతర్గత రహదారులపై చెత్త చెదారం లేకుండా శుభ్రంగా ఉంచాలని తెలిపారు. ఈ క్రమంలో వాడలోని కిరాణా దుకాణం ముందు ఉన్న చెత్త చెదారాన్ని పరిశీలించి సంబంధిత దుకాణం యజమానికి జరిమానా విధించాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ భుజంగరావు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

**సమగ్ర సర్వే ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలి**

ప్రభుత్వం చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల గణన సర్వే ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. బుధవారం జిల్లాలోని ఆసిఫాబాద్ మున్సిపల్ పరిధిలోని జనకాపూర్ వార్డు మేకల వాడలో కొనసాగుతున్న సర్వే ప్రక్రియను మున్సిపల్ కమిషనర్ భుజంగరావుతో కలిసి పరిశీలించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వే సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యుల వివరాలను సేకరించాలని, నిర్ణీత నమూనాలో పొందుపరిచిన ప్రతి అంశాన్ని తప్పనిసరిగా పూరించాలని తెలిపారు. సర్వే సిబ్బంది వివరాల సేకరణలో ఎలాంటి పొరపాట్లు చేయకూడదని, వివరాలను స్పష్టంగా నమోదు చేయాలన్నారు.

## రాయి సెంటర్, రాజ్ గోండ్ సేవా సమితి ఎన్నిక



నవతెలంగాణ-పెంచికల్‌పేట్

మండల కేంద్రంలో రాజ్‌గోండ్ సేవా సమితి జిల్లా అధ్యక్షుడు గుణవంతరావు అధ్యక్షతన మండల రాయి సెంటర్, రాజ్ గోండ్ సేవాసమితి ఎన్నికను నిర్వహించారు. మండల సర్‌మేడిగా పోర్తేటి ప్రభాకర్, ఉపమెడిగా సిడాం అశోక్, సెక్రటరీగా మడే మల్లేష్‌ను ఎన్నుకున్నారు. అనంతరం నూతనగా ఎన్నికైన వారికి నియమాక పత్రాలను అందించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో రాజ్ గోండ్ సేవా సమితి రాష్ట్ర కార్యదర్శి పెందూర్ సుధాకర్, జిల్లా రాయి సెంటర్ మేడి కుర్సింగ మోతిరం, మడవి శ్రీనివాస్ పాల్గొన్నారు.

## బయోమెట్రిక్ పరిశీలనలో అప్రమత్తంగా ఉండాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



ఈనెల 17,18 తేదీలలో నిర్వహించే గ్రూప్ 3 పరీక్షల నేపథ్యంలో బయోమెట్రిక్ పరిశీలనలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని గ్రూప్ 3 పరీక్ష జిల్లా పోలీసు నోడల్ అధికారి అదనపు ఎస్పీ ప్రభాకర్ రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని డీపీఓ కార్యాలయంలో చీఫ్ సూపరింటెండెంట్స్, ఇన్విజిలేటర్స్‌కు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రూప్ 3 పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని, బయోమెట్రిక్ ద్వారా పరీక్ష రాయబోయే అభ్యర్థిని గుర్తించడం చాలా ముఖ్యమన్నారు. దీనికోసం ప్రత్యేకంగా జిల్లాలో నియమించిన 58 మంది ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ చీఫ్ సూపరింటెండెంట్స్, బయోమెట్రిక్ ఇన్విజిలేటర్స్‌గా పని చేయనున్నారన్నారు. బయోమెట్రిక్ తీసుకునే సమయంలో ఎదురయ్యే సమస్యలపై, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై, పాటించాల్సిన నియమాలపై సిబ్బంది అవగాహన కలిగి ఉండాలని ఉద్దేశంతో శిక్షణ కార్యక్రమం నిర్వహించినట్లు వివరించారు. సిబ్బంది శిక్షణ సద్వినియోగం చేసుకొని పరీక్ష పకడ్బందీగా నిర్వహించేలా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో రీజినల్ కోఆర్డినేటర్ డాక్టర్ లక్ష్మీ నరసింహం, పోలీస్ బయోమెట్రిక్ ఆఫీసర్ మార్కండేయ, అసిస్టెంట్ పోలీస్ బయోమెట్రిక్ ఆఫీసర్స్ శ్రీను, సందీప్ పాల్గొన్నారు.

## నష్టపరిహారం అందజేత

నవతెలంగాణ-కెరమెరి

గత నెల రోజుల క్రితం దేవుడుపల్లి బీట్ పరిధిలోని నాగల్‌గొంది (నాయకపు గూడ) గ్రామానికి చెందిన మల్లసెట్టి ఎల్లయ్యకు చెందిన గోవ పై పులి దాడి చేసి హతమార్చింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం మంజూరు చేసిన రూ.10 వేల చెక్కును బుధవారం ఎఫ్ఆర్ఓ మాజారోద్దీన్ ఎల్లయ్యకు అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ వెంకట్ పాల్గొన్నారు.



# గ్రూప్-3 పరీక్ష పకడ్బందీగా నిర్వహించాలి

- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే



అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో ఈ నెల 17, 18 తేదీలలో జరుగనున్న గ్రూప్-3 పరీక్ష జిల్లాలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాలలో పూర్తి స్థాయిలో వసతులు కల్పించాలని, పరీక్ష పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల పాఠశాల, జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాలను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రూప్-3 పరీక్షకు జిల్లాలో ఏర్పాటు చేసిన 18 పరీక్ష కేంద్రాలలో పూర్తి స్థాయిలో అవసరమైన ఏర్పాట్లను చేయాలని అధికారులను ఆదేశించారు. పరీక్ష కేంద్రంలో అభ్యర్థులకు తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలని, పరీక్షకు అవసరమైన ఫర్నిచర్, వెలుతురు, ఫ్యాన్లు ఏర్పాటు చేయాలని, ప్రహరీ గోడకు అనుకొని ఉన్న గదుల కిటికీలను మూసి ఉంచాలని సూచించారు. విద్యుత్‌లో ఎలాంటి అంతరాయం లేకుండా నిరంతర సరఫరా జరిగేలా అధికారులు పర్యవేక్షించాలని, పరీక్ష కేంద్రంలో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. 4500 అభ్యర్థులు పరీక్షలకు హాజరుకానున్నారని, వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని, అవసరమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో పరీక్షల ప్రాంతీయ సమన్వయకర్త లక్ష్మీనరసింహ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, పాల్గొన్నారు.

# పత్తిని సీసీఐ కేంద్రంలోనే విక్రయించాలి

- ఎమ్మెల్యే డా.పాల్వాయి హరీష్‌బాబు

నవతెలంగాణ-సిర్పూర్(టి)

రైతులు పండించిన పత్తి పంటను సీసీఐ కేంద్రంలో ప్రభుత్వం మద్దతు ధర మేరకే అమ్ముకోవాలని, దళారులను నమ్మి మోసపోవద్దని ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని శ్రీరామ కాటన్ జిన్నింగ్ మిల్లు వద్ద కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పత్తి రైతుల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం రూ.7521 మద్దతు ధర ఇస్తోందని, రైతులందరూ సీసీఐ కొనుగోలు కేంద్రాల వద్ద పత్తిని విక్రయించాలని సూచించారు. కార్యక్రమంలో సీపీఓ వెంగల్ రెడ్డి, ఏడీ మనోహర్, మార్కెట్ కమిటీ సెక్రటరీ భాస్కర్, ఏఓలు గిరీషన్, ప్రేమలత, మార్కెట్ కమిటీ చైర్మన్ దేవయ్య, పొలాడి హనుమంతు రావు, చిలువేరు ప్రవీణ్ పాల్గొన్నారు.



సిర్పూర్(టి) : కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న అధికారులు, ఎమ్మెల్యే



కౌటాల : పత్తి కొనుగోళ్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు

**కౌటాల** : మండల కేంద్రంలోని వైష్ణవి మాత జిన్నింగ్ మిల్లులో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో పత్తి కొనుగోళ్లను అధికారికంగా మార్కెట్ కమిటీ చైర్మన్ సిద్దల దేవయ్యతో కలిసి సిర్పూర్ ఎమ్మెల్యే డా.పాల్వాయి హరీష్ బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్తి రైతుల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. రైతులు కేంద్రం కల్పిస్తున్న మద్దతు ధరకే పత్తిని విక్రయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీపీఓ వెంగల్ రెడ్డి, ఏడీ మనోహర్, మార్కెట్ కమిటీ సెక్రటరీ భాస్కర్, బీజేపీ జిల్లా కార్యదర్శి బండి రాజేందర్ గౌడ్, మండల అధ్యక్షులు నరులె వానుపటేల్, కుంచాల సత్తయ్య, ఎల్ములే మల్లయ్య, దుర్గం మోతిరాం, నేరెళ్ల అశోక్, తుకారాం, లావణ్య రైతులు పాల్గొన్నారు.

# ఘనంగా కాళోజీ వర్ధంతి వేడుకలు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాళోజీ నారాయణరావు వర్ధంతి వేడుకలను బుధవారం కాగజ్‌నగర్ పట్టణంలో ఘనంగా నిర్వహించారు. రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు ఆయన రాష్ట్రానికి చేసిన సేవలను కొనియాడారు. తెలంగాణ ఏర్పాటులో ప్రధాన భూమిక పోషించారని, ఆయన కవితలు, రచనలతో తెలంగాణ ప్రజలను ఉత్తేజపర్చారని అన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు ఎం.జయదేవ్ అబ్రహం, కార్యదర్శి శివప్రసాద్ నాయర్, సభ్యులు బావండ్లపల్లి నర్సయ్య, ఎఎస్ఎర్ మూర్తి, సత్యనారాయణ, గిరిజన సంఘం నాయకుడు సోయం చిన్నయ్య పాల్గొన్నారు.

**సీనియర్ సిటిజన్స్ అసోషియేషన్ ఆధ్వర్యంలో..**

అదేవిధంగా సీనియర్ సిటిజన్స్ అసోషియేషన్ ఆధ్వర్యంలో కూడా కాళోజీ నారాయణరావు వర్ధంతిని నిర్వహించారు. కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేశారు. రెండు నిమిషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో అసోషియేషన్ రాష్ట్ర కార్యదర్శి మార్త సత్యనారాయణ, సభ్యులు యు నారాయణ, కలికోట రమణయ్య, కోటేశ్వర్‌రావు, ఆకుల నాగేశ్వర్‌రావు, రాంబాబు, మసూద్ పాల్గొన్నారు.



కాళోజీ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న రిటైర్డ్ ఉద్యోగులు

# కొనుగోలు కేంద్రాలతో మద్దతు ధర చెల్లింపు

- అదనపు కలెక్టర్ దీపక్ తివారీ



వివరాలు తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్

నవతెలంగాణ-దహెగాం

రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతుల వద్ద నుండి ధాన్యం కొనుగోలు చేసి మద్దతు ధర చెల్లిస్తుందని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లాతో కలిసి సందర్శించి కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతుల వద్ద నుండి నిబంధనల ప్రకారం నాణ్యమైన వరి ధాన్యం కొనుగోలు చేసి సంబంధిత రైతుల ఖాతాలలో నగదు చెల్లింపులు చేయడం జరుగుతుందని తెలిపారు. రైతుల సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం కనీస మద్దతు ధర అందించి రైతుల నుండి ధాన్యం కొనుగోలు చేస్తుందన్నారు. కేంద్రాలలో రైతుల సౌకర్యార్థం తాగునీరు, నీడ, గన్ని సంచులు, టార్పాలిలను అందుబాటులో ఉంచడం జరిగిందని, తేమ, తూకం యంత్రాలు, ఇతర అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని పేర్కొన్నారు. అనంతరం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజనం నాణ్యత, సామాగ్రి, పారిశుధ్య పనులను పరిశీలించారు. విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని, మధ్యాహ్నం భోజనంలో మెనూ ప్రకారం పోషక విలువలు కలిగిన ఆహారాన్ని సకాలంలో అందించాలన్నారు. ఆహారం తయారీలో తాజా కూరగాయలు, నాణ్యమైన సరుకులను వినియోగించాలని, పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని, విద్యార్థుల ఆరోగ్య స్థితిగతులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల తహసీల్దార్ కవిత, ఎంపీడీఓ రాజేందర్, పంచాయతీ కార్యదర్శి ప్రణీత్, పీఏసీఎస్ ఇన్‌చార్జి సీఈఓ నారాయణ, అధికారులు పాల్గొన్నారు.

# బాలల హక్కులపై అవగాహన కలిగి ఉండాలి

నవతెలంగాణ-వాంకిడి

మండలంలోని ఖిర్డి గ్రామ పంచాయతీలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా బాలల సంరక్షణ విభాగం చైల్డ్ హెల్ప్‌లైన్ సంయుక్త ఆధ్వర్యంలో బాలల హక్కుల వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు బాలల హక్కులు, రక్షణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా బాలల సంరక్షణ విభాగం సోషల్ వర్కర్ డోంగ్రి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుండే బాలలు వారి హక్కులు, రక్షణ చట్టాల పట్ల అవగాహన కలిగి ఉండాలని, నేటి బాలలే రేపటి పౌరులని, వారి హక్కులను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించి, జీవితంలో ఉన్నంతంగా ఎదగాలని, మధ్యలో ఎదురయ్యే సమస్యలను ఆత్మ స్థైర్యంతో ఎదుర్కోవాలన్నారు. కార్యక్రమంలో చైల్డ్ హెల్ప్‌లైన్ సూపర్‌వైజర్ పీతాంబర్, సుకన్య, శకుంతల, పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.



## వాంకిడి సంఘటన కారకులపై చర్యలు తీసుకోవాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలోని వాంకిడి ఆశ్రమ పాఠశాలలో కలుషిత ఆహారంతో విద్యార్థినులు అస్వస్థతకు గురై 15 రోజులు గడిచిన ఘటనకు కారకులైన వారిపై చర్యలు తీసుకోకపోవడం బాధాకరమని వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పక్క జిల్లాలో ఇలాంటి సంఘటన జరిగితే వెంటనే అధికారులు స్పందించి బాధ్యులపై చర్యలు తీసుకున్నారని గుర్తు చేశారు. జిల్లాలో మాత్రం దానికి విరుద్ధంగా పాఠశాలలో పనిచేస్తున్న నలుగురిని బదిలీ చేస్తూ ఉత్తర్వులు విడుదల చేయడం బాధాకరమన్నారు. ఇప్పటికి విద్యార్థినులు హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ సీరియస్ కండిషన్‌లో ఉన్నారని తెలిపారు. వారికి న్యాయం చేయడంతో పాటు అధికారులపై చర్యలు తీసుకోకుంటే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి చాపిలే సాయి కృష్ణ, జిల్లా అధ్యక్షులు వసాకె సాయికుమార్, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు టికానంద్, ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి సుంకరి సాయి కృష్ణ, జిల్లా కమిటీ సభ్యులు అయూబ్ ఖాన్, డివైఎఫ్ఐ నాయకులు శ్రీకాంత్ పాల్గొన్నారు.

## అక్రమ కబ్జాలపై అధికారుల ఉక్కుపాదం

నవతెలంగాణ-ఆసిఫాబాద్



జిల్లా కేంద్రంలోని చెక్‌పోస్ట్ ప్రాంతంలో కొద్ది కాలంగా ఉన్న టీడీపీపీ భూములను, నాళాలను ఆక్రమించుకొని అక్రమ కట్టడాలు కడుతున్న నేపథ్యంలో మీడియాలో వచ్చిన కథనాలతో స్పందించిన రెవెన్యూ అధికారులు గతంలో ఆ భూముల యజమానులకు నోటీసులు జారీ చేసి బుధవారం వాటిని కూలగొట్టారు. అదే ప్రాంతంలో నుండి వెళ్తున్న నాళాను పునరుద్ధరించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ లోకేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వ భూములను కబ్జా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. నిర్ణీత విధానాన్ని అనుసరించి చర్యలు తీసుకోవడం జరుగుతుందని వివరించారు. జిల్లా కేంద్రంలో ప్రభుత్వ భూముల, టీడీపీపీ భూముల ఆక్రమణపై దృష్టి కేంద్రీకరించినట్లు తెలిపారు. ప్రభుత్వం కూడా ఆ దిశగా చర్యలు తీసుకోవాలని సూచించినట్లు వివరించారు. కార్యక్రమంలో ఇరిగేషన్ డీఈ దామోదర్, మండల తహసీల్దార్ రోహిత్ దేశ్ పాండే ఇతర అధికారులు పాల్గొన్నారు.

## పీఎం జుగా పథకంతో గిరిజనుల అభివృద్ధి సాధ్యం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రధానమంత్రి జన జాతీయ గ్రామీణ ఉత్కర్ష్ అభియాన్(జుగా) పథకం ద్వారా గిరిజనుల అభివృద్ధి సాధ్యమవుతుందని ఆ పథకం ప్రత్యేక అధికారి శంకర్ అన్నారు. గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయంలో జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారిని రమాదేవితో కలిసి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఎం జుగా పథకంలో భాగంగా జిల్లాలోని 102 గిరిజన గ్రామాల్లో వివిధ రకాల అభివృద్ధి పనులు చేయనున్నట్లు తెలిపారు. గిరిజనుల జీవనస్థితిగతులు అభివృద్ధి చేయడానికి ఉపయోగపడుతుందని, వారి ఆధార్ నెంబర్‌తో పాటు ఆయుష్మాన్ భారత్ కార్డులు అందజేయాలన్నారు. దీంతో పాటు కిసాన్ క్రెడిట్ కార్డులు, కుల ధ్రువీకరణ పత్రాలు, వివిధ రకాల మౌలిక అవసరాలు తీర్చడానికి వారికి దగ్గరలోని క్యాంపులు నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశంలో కాగజనగర్, జైనూర్ ఏటీడీఓలు ఖమర్ హుసేన్, శ్రీనివాస్, ఎస్సీఆర్పీ రాథోడ్ రవీందర్, కుడిమెత ఆనంద్, ఇంజనీర్ శాఖ అధికారులు నిరంజన్, నజీముద్దీన్ పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారించాలని పీఆర్టీయూటీఎస్ జిల్లా అధ్యక్షుడు ఏటుకూరి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. జిల్లా విద్యాధికారి యాదయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఉపాధ్యాయులు చేస్తున్న కుటుంబ సర్వే పనిదినాలలో మాత్రమే చేపట్టాలని సెలవు రోజులలో మినహాయింపు ఇవ్వాలన్నారు. జిల్లాలో ప్రయిమరీ, అప్పర్ ప్రయిమరీ, ఉన్నత పాఠశాలలో స్వచ్ఛ కార్మికులు ఆగస్టు మాసం నుండి పనిచేస్తున్నారని వేతనాలు నేటికి విడుదల చేయలేదన్నారు. వెంటనే స్వచ్ఛ కార్మికులు వేతనాలు విడుదల చేయాలని కోరారు. డీఎస్సీ 2008కి సంబంధించి ఎంపికైన ముగ్గురు ఉపాధ్యాయుల వేతన సమస్యలు పరిష్కరించాలన్నారు. విద్యార్థుల సంఖ్య ఆధారంగా ఉపాధ్యాయులను సవరించాలన్నారు. జిల్లాలో ఎస్ఎస్ఏలో ఖాళీగా ఉన్న కోఆర్డినేటర్ పోస్టులు భర్తీ చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్, నాయకులు మడవి హనుమంతు, సాంబశివరావు, పర్సా చంద్రశేఖర్, దెబ్బటి సత్యనారాయణ, బైరీ వరలక్ష్మి, అనురాధ భాయి, నారాయణ సింగ్, సునీత పాల్గొన్నారు.



నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
గురువారం | నవంబర్ 14, 2024 | www.navatelangana.com

## సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి భూజ

నవతెలంగాణ-తాండూర్



పట్టణ లోని 33వ వార్డు హనుమాన్ బస్తీలో మున్సిపల్ చైర్ పర్సన్ జక్కుల శ్వేత బుధవారం సీసీ రోడ్డు, డ్రైనేజీ పనుల నిర్మాణానికి భూమి పూజ చేశారు. రూ.మూడు లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణం పటిష్టంగా ఉండాలని కాంట్రాక్టర్లకు సూచించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ పోలు ఉమాదేవి శ్రీనివాస్ కమీషనర్ శ్రీనివాస్ రావు డీఈ కౌన్సిలర్ ఉమాదేవి, సాయి కిరణ్, టీఓ అశ్విత్, కాంగ్రెస్ నాయకులు సూరం బాణేష్, గురుండ్ల సత్యనారాయణ, బండి రాము, ఎజాస్, మునిర్ వెంకటరాజం, ఓదెలు పాల్గొన్నారు.

## వైద్య ఖర్చుల నిమిత్తం ఆదుకోవాలని వేడుకోలు

నవతెలంగాణ-లక్షెట్టిపేట



మున్సిపాలిటీ పరిధిలోని గోదావరి రోడ్‌లో నివాసం ఉండే అబ్దుల్ కరీం గత మూడు నెలలుగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నారు. బాధితుడు పట్టణంలో ప్రయివేట్ డ్రైవర్‌గా పని చేసుకుంటూ చాలీచాలని ఆదాయంతో తన భార్య అయిదుగురు పిల్లల్ని పోషిస్తున్నాడు. బాధితునికి ఆర్థిక సాయం అందించాలని, తన కుటుంబాన్ని ఆదుకోవాలని వేడుకుంటున్నారు. మానవత దృక్పథంతో సాటి మనిషికి ఎంతోకొంత తనవంతుగా సహాయం అందించాలని, ఫోన్ పే, గూగుల్ పే ద్వారా 9908557512 నెంబర్‌కు విరాళం ఇవ్వాలని కోరారు.

## కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

● ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి



నవతెలంగాణ-జైపూర్

దళారులను ఆశ్రయించకుండా ప్రభుత్వ పరంగా ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. ఐకేపీ ఆధ్వర్యంలో భీమారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ కుమార్ దీపక్‌తో కలిసి బుధవారం ప్రారంభించారు. అదేవిధంగా జైపూర్ మండల కేంద్రంలో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించారు. ఈ సంధర్భంగా మాట్లాడుతూ రైతుల సౌకర్యార్థం అందుబాటులో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని, నాణ్యమైన ధాన్యం విక్రయించి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర పొందాలని సూచించారు. అనంతరం స్థానిక కాంగ్రెస్ నాయకులతో పాటు మత్స్యశాఖ అధికారులతో కలిసి పోతన్‌పల్లి శివారు గోల్లవాగు ప్రాజెక్టులో చేప పిల్లలను వదిలారు. గొల్లవాగు ప్రాజెక్టులో రూ.4 లక్షల 95 వేల చేప పిల్లలను వదలడం జరుగుతుందని మత్స్యశాఖ అధికారి తెలిపారు. ఈ సంధర్భంగా భీమారం మండల కేంద్రం యాదవ కాలనీలో కొనసాగుతున్న సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వే తీరును పరిశీలించారు. కుటుంబాల వారి వివరాల సేకరిస్తున్న ఎన్యూమరేటర్లతో మాట్లాడిన ఆయన ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కుటుంబ సర్వే తప్పులు లేకుండా చూడాలని సూచించారు.

**కోతులు, కుక్కల సమస్య పరిష్కరించండి**

భీమారం మండల కేంద్రానికి వచ్చిన ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామితో గ్రామస్థులు కోతులు, కుక్కలతో ఇబ్బందులు పడుతున్నామని మొరపెట్టుకున్నారు. కోతులు, కుక్కల సమస్య పరిష్కరించాలని కోరిన గ్రామస్థులకు సమాదానంగా కోతుల నివారణ మార్గాలు చెప్పండి ఆచరణలో పెడుతామని బదులిచ్చారు. కాగా జాతీయ రహదారి నుండి ఎస్సీ, ఎస్టీ కాలనీకి గల ప్రధాన రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీ నిర్మించాలని కాలనీవాసులు కోరారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే డ్రైనేజీ నిర్మాణం చేపడుతామని హామీ ఇచ్చారు.

## 101 వరి రకంతో అధిక దిగుబడులు



నవతెలంగాణ-జన్నారం

101 వరి రకంతో రైతులకు అధిక లాభంచేకూరుతుందని వడ్ల డిస్ట్రిబ్యూటర్ మల్లాల రాజన్న పేర్కొన్నారు. బుధవారం మండలం రెండ్లగూడ గ్రామంలో ఇండస్ వాలీ వారి ఇండస్ 101 రకంను ముడికే సాగర్ రైతు పొలంలో, అలాగే కలమడుగు గ్రామంలో జక్కుల శ్రీనివాస్ పోలంలో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా 101 రకం అధిక దిగుబడి వస్తాయని రైతులు అన్నారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిబ్యూటర్ సత్యనారాయణ, ఫర్టిలైజర్ మల్యాల రాజన్న, డీలర్ విజయసాయి, ఫర్టిలైజర్ మందపెల్లి అఖిల్ కంపెనీ ప్రతినిధులు శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మణ్, రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆర్కే-7 గ్రూప్ నూతన ఏజెంట్‌కు సన్మానం



నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ ఏరియా ఆర్కే-7 గ్రూప్‌కి నూతన ఏజెంట్‌గా వచ్చిన రాజేందర్‌ను గుర్తింపు సంఘం (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో బుధవారం పూల మొక్క అందజేసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా డిప్యూటీ జనరల్ సెక్రెటరీ కందికట్ల వీరభద్రయ్య మాట్లాడుతూ శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే-7 గ్రూప్‌కు నూతనంగా వచ్చిన ఏజెంటు రాజేందర్ స్వాగతం పలుకుతూ ఆర్కే-7 గ్రూపులో ఉన్న ఆర్కే-7, ఆర్కే న్యూటెక్ గనుల్లో రక్షణతో కూడిన ఉత్పత్తి సాధిస్తూ కార్మికుల సంక్షేమానికి కృషి చేయాలని అన్నారు. ఆర్కే-7, ఆర్కే న్యూటెక్ గనుల జీవితకాలం పెరుగుదలకు కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ముస్కే సమ్మయ్య, బ్రాంచ్ సెక్రెటరీ బాజీ సైదా, అసిస్టెంట్ సెక్రెటరీ మోత్కూరి కొమరయ్య, బ్రాంచ్ వైస్ ప్రెసిడెంట్ కిషన్‌రావు, ఏరియా సెక్రెటరీ మారేపల్లి సారయ్య, సదానందం యాదగిరి, బానేష్, శ్రీనివాస్‌రెడ్డి, రాజ్ కుమార్ పాల్గొన్నారు.

## కుటుంబ సర్వేను పరిశీలించిన ఎంపీడీఓ

నవతెలంగాణ-జన్నారం

మండలంలోని మురిమడుగు కలమడుగు ధర్మారంలో జరుగుతున్న సమగ్ర కుటుంబ సర్వే ప్రక్రియని ఎంపీడీఓ శశికళ బుధవారం పరిశీలించారు. ఎన్యుమరేటర్లకు ఇచ్చిన ఫార్మట్ బుక్‌లో ఎలాంటి తప్పులు రాయకూడదని సూచించారు. ఆ కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలను మాత్రమే ఫార్మాట్‌లో పొందుపరచాలన్నారు. సర్వేను త్వరితగతిన పూర్తిచేయాలని సూచించారు. ఎన్యుమరేటర్లకు ఎలాంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యదర్శులు సూపర్‌వైజర్లు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# 'హద్దు' దాటిన అవినీతి

● కబ్జాదారులకు సహకరించిన అధికారులు
● వివాదంలో ఉన్న ప్రభుత్వ భూమి స్వాధీనం

నవతెలంగాణ-తాండూర్

కంచ చేను మేసిన చందాన ప్రభుత్వ భూములను కాపాడాల్సిన ప్రభుత్వ అధికారులే అవినీతిని ప్రోత్సహిస్తున్నారు. కాసులకు కక్కుర్తి పడి కబ్జాదారులకు సహకరిస్తున్నారు. ప్రభుత్వ భూములను భూభకాసురులకు కట్టబెట్టి అవినీతికి పాల్పడుతున్నారు. తప్పుడు ధ్రువపత్రాలను సృష్టించి ప్రభుత్వ భూములను కాజేస్తున్నారు. ఇలాంటి అవినీతి బెల్లంపెల్లి దేవదాయ శాఖలో చోటు చేసుకుంది. దేవాదాయ శాఖకు సంబందించిన రూ.3 కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూమిని కబ్జాదారులకు కట్టబెట్టాలని చూసిన డివిజనల్ అధికారి నసీరుద్దీన్ అవినీతి బట్టబయలైంది. ఎన్నో ఏండ్లుగా వివాదంలో ఉన్న దేవదాయ శాఖ భూమిని, జిల్లా సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్, దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆదిలాబాద్ అసిస్టెంట్ కమిషనర్ నవీన్ కుమార్, అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్ పర్యవేక్షణలో బెల్లంపల్లి రైల్వే స్టేషన్ హనుమాన్ ఆలయ భూమిని మరో మారు సమగ్ర సర్వే చేశారు. నిజ నిరూపనతో ఏండ్ల తరబడి కబ్జాదారుల ఆధీనంలో ఉన్న విలువైన భూమి తిరిగి దేవదాయ శాఖకు కేటాయించారు. రూ.కోట్ల విలువైన భూమి చుట్టూ హద్దు రాళ్ల ఏర్పాటు చేశారు. బెల్లంపల్లి రైల్వేస్టేషన్ ఎదురుగా ఉన్న శ్రీసంజీవని హనుమాన్ దేవాల యానికి చెందిన భూమి సర్వే నెంబర్ 12/6లో 3.02 ఎకరాలు ఉండగా ఇందులో 16 గుంటల భూమి ఏండ్ల కింద



హద్దురాళ్లను పాతుతున్న దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు

అన్యాక్రాంతమైంది. పలుమార్లు రెవెన్యూ, దేవదాయ శాఖ అధికారులు సంయుక్తంగా సర్వే చేసిన ప్రయోజనం లేకపోయింది. కబ్జాదారులు స్థానిక అధికారులను అభ్యపెట్టి దేవదాయ శాఖ భూమిని వషపరచుకునేందుకు కుటిల ప్రయత్నం చేశారు. స్థానిక ఆలయ కమిటీ సభ్యులు దేవదాయ శాఖ సమన్వయంతో భూ అక్రమాలపై ఉన్నతాధికారులను సంప్రదించి అధికారుల అవినీతిని బట్ట బయలు చేశారు. గతంలో పలుమార్లు సర్వే చేసిన రెవెన్యూ శాఖకు చెందిన డివిజనల్ ఇన్స్‌పెక్టర్, సర్వే, ల్యాండ్ రికార్డ్ నసీరొద్దీన్ కబ్జాదారులకు అనుకూలంగా తప్పుడు సర్వే చేసినట్లు ప్రస్తుత సర్వేతో తేటతెల్లమై నట్లుగా అధికారులు గుర్తించారు. దేవదాయ శాఖ భూమిని కబ్జాదారులకు కట్టపెట్టాలని చూసిన డివిజనల్ సర్వే ఇన్స్‌పెక్టర్, ల్యాండ్ రికార్డ్ అధికారిపై చర్యలు తీసుకోవాలని విశ్వహిందూ పరిషత్ సభ్యులు స్థానిక ఆలయాల కమిటీ నాయకులు కోరుతున్నారు.

# ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకం కాదు

● జనాభా నిష్పత్తితో ప్రయోజనాలు చేకూరాలి ● ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి



నవతెలంగాణ-జైపూర్

మాలల మహా పాదయాత్ర మరే కులాల వారికి వ్యతిరేకం కాదని, జనాభా నిష్పత్తితో ప్రయోజనాలు చేకూరాలని చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. భద్రాచలం నుంచి బయలుదేరిన మాలల మహాపాదయాత్ర బుధవారం మంచిర్యాల జిల్లా ఇందారం గ్రామానికి చేరుకుంది. రాజీవ్ రహదారి మీదుగా ఇందారం నుంచి బయలుదేరిన పాదయాత్రలో ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా దళితుల ఐక్యత కోసం మాలల మహా పాదయాత్ర కొనసాగుతుందని తెలిపారు. మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్‌తో కలిసి పాదయాత్రలో పాల్గొన్నారు. రాష్ట్రంలో అత్యధికంగా జనాభా కలిగివున్న మాలలకు ప్రాధాన్యత లేకుండా పోయిందని అన్నారు. రాజకీయంగా చూసినా మాలల సంఖ్య అతితక్కువగా ఉన్నట్లు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ రాష్ట్రాల పరిధిలో చేసుకోవచ్చునడం ఆంబేద్కర్ ఆశయానికి గొడ్డలి పెట్టని రాష్ట్ర అధ్యక్షులు పిల్లి సుధాకర్ అన్నారు. న్యాయవ్యవస్థ కూడా రాజకీయ ప్రభావితం కావడం దురదృష్టకరమని పేర్కొన్నారు. అత్యధికంగా జనాభ కలిగిన మాలల జనాభాను తక్కువ చేస్తూ ప్రచారం చేస్తున్నారని ఆవేధన వ్యక్తం చేశారు. ఇతర కులాలతో పోల్చితే మాలల జనాభా శాతం అధికంగా ఉంటుందని తెలిపారు. మాల, మాదిగ కులాలు, ఉప కులాల జనాభా ఎంత.. వారి స్థితిగతులు ఏమిటనే విషయమై జాతీయ మాల మహానాడు ప్రశ్నిస్తుందని తెలిపారు. తెలంగాణ ఏర్పాటు నాటి నుండి దళితులకు మూడు ఎకరాల భూమి, దళిత బంధు, ఆంబేద్కర్ ఓవర్సీస్ స్కాలర్షిప్, ఎస్సీ కార్పోరేషన్ రుణాలు, గురుకుల సీట్లు ఎవ్వరికి ఎక్కువ ఉపయోగపడుతున్నాయో శాస్త్రీయ లెక్కలను చూస్తే తెలుస్తోందని అన్నారు. ఇందారం నుండి రాజీవ్ రహదారి మీదుగా సాగిన పాదయాత్రలో చెన్నూర్ నియోజకవర్గం ఇన్‌చార్జీ శీలం వెంకటేష్ పాల్గొన్నారు.

# రిటైర్డ్ పోలీస్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

నవతెలంగాణ-మంచిర్యాల

రిటైర్డ్ పోలీసు ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వ ప్రరిష్కరించాలని తెలంగాణ రిటైర్డ్ పోలీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఏజెల్ల శ్రీనివాస్‌రావు అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని హైటెక్ సిటీ క్లబ్లఓ ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తాము ఎదుర్కొంటున్న సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు నూతన జిల్లా కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. ఉద్యోగ విరమణ పొందిన వారికి ఎంప్లాయిమెంట్ హెల్త్ స్కీంలో ఉన్నటువంటి స్కీంలను ఎక్కడ కూడా అమలు చేయడంలేదన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో సరైన సదుపాయాలు లేక వైద్యం అందడం లేదన్నారు. ఉద్యోగులకు అందించేటటువంటి హెల్త్ స్కీంకు సంబంధించి రూ.800 అలవెన్స్ ఇస్తారని దానిని రూ.వెయ్యికి పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 2024 మార్చ్ తరువాత రిటైడ్ అయిన ఉద్యోగులకు జీపీఎఫ్ గ్రాడ్యుటీ, ఈఎల్ఎం టాక్స్ మెంట్, గ్రాడ్యూటి కమిషన్కు సంబంధించిన అమౌంట్ రాకపోవడంతో అనేక ఇబ్బందులు ఏర్పడుతున్నాయన్నారు. పెండింగ్‌లో ఉన్న పీఆర్సీ,



డీఏలను విడుదల చేయలని, ఆదాయ పన్నును పూర్తిగా మినహాయింపు ఇవ్వాలని, ఎంప్లాయిస్ హెల్త్ స్కీం ద్వారా క్యాష్ లేస్ ట్రీట్మెంట్ అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అన్ని జిల్లాలో కార్యవర్గాల సమావేశాల ఏర్పాటు అనంతరం జనరల్ బాడీలో ఒక స్టేట్ సమావేశం నిర్వహించుకొని తమకు ఉన్నటువంటి రిటైర్మెంట్ బెనిఫిట్స్ డిమాండ్స్ పైన త్వరలో స్థానిక ఎమ్మెల్యే, మంత్రులను కలిసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకవెళ్లనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జనరల్ సెక్రటరీ ఎం.రాజమల్లరెడ్డి, గౌరవ అధ్యక్షుడు సీహెచ్ రాజమౌళి గౌడ్, వైస్ ప్రెసిటెండ్ టీ వేణుగోపాల స్వామి, జాయింట్ సెక్రటరీ ఎండీ తాహెరుద్దీన్, మంచిర్యాల గౌరవ అధ్యక్షుడు జే నారయణ రావు, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా రిటైర్డ్ పోలీస్ ఉద్యోగులు పాల్గొన్నారు.

# ఇంటింటి సర్వే పనులను వేగవంతం చేయాలి

నవతెలంగాణ-తాండూర్

బెల్లంపల్లి పట్టణంలో ఇంటింటి సర్వే పనులను వేగవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు సూచించారు. బుధవారం పట్టణంలోని పలు వార్డులలో జరుగుతున్న సమగ్ర బహుళ ప్రయోజన సర్వే పనులను పర్యవేక్షించారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో మొత్తం 16262 నివాస గృహాలు ఉండగా మంగళవారం సాయంత్రం వరకు 4760 గృహాల సర్వే నిర్వహించడం జరిగిందని తెలిపారు. సర్వే కోసం పట్టణాన్ని 130 బ్లాకులుగా విభజించి 108 మంది ఎన్యుమరేటర్లను నియమించడం జరిగిందన్నారు. పర్యవేక్షణ కోసం 14 మంది సూపర్‌వైజర్లు పని చేస్తున్నట్లు తెలిపారు. సర్వే సిబ్బందికి అంగన్‌వాడీ టీచర్లు ఆయా కార్యకర్తలు మున్సిపల్ సిబ్బంది సహకరించాలని కోరారు. కన్యుమరేటర్ వీలైనంత మట్టుకు ఉదయం పూట సర్వే పనుల నిర్వహించాలని సూచించారు. నిర్ణీత గడువు లోపు అప్పగించిన సర్వే పనులను పూర్తి చేయాలనన్నారు. పట్టణంలోని ప్రజలు అడిగిన



వివరాలను, పత్రాలను అందించి సర్వే సిబ్బందికి సహకరించాలని కోరారు.

## వడ్ల కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ-తాండూర్

డీఆర్‌డీఏ ఐకేపీ మండల సమైక్య ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వడ్ల కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల సమైక్య అధ్యక్షురాలు స్వప్న కోరారు. సహకార సంఘం చైర్మన్ చింతం స్వామి, ఎంపీడీఓ మహేందర్, ఏఓ ప్రేమ్ కుమార్‌తో కలిసి బెల్లంపల్లి మండలంలోని చంద్రవెల్లి గ్రామంలో వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకొని మద్దతు ధర పొందాలని సూచించారు. రైతులు మట్టి పెల్లలు, తాలు లేని నాణ్యమైన ధాన్యాన్ని తీసుకువచ్చి మద్దతు ధర పొందాలని తెలిపారు. ఇందిరా క్రాంతి పథకం ద్వారా చేపట్టే వడ్ల కొనుగోలు కేంద్రాల లావాదేవీలలో వచ్చే లాభాన్ని గ్రామ సమైక్యలకు ఎస్‌హెచ్‌జీ లకు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. పరోక్షంగా మండలంలోని గ్రామాలకు రైతు కుటుంబాలకు లబ్ధి చేకూరుతుందని తెలిపారు. రైతులు దళారులను ఆశ్రయించకుండా ప్రభుత్వం చేపట్టే కొనుగోలు కేంద్రాలలో ధాన్యాన్ని విక్రయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం శ్యామల, ఏఈఓ అంజలి సీసీలు రామకృష్ణ, సురేష్, కొనుగోలు కమిటీ సభ్యుడు శ్రీలత పాల్గొన్నారు.

## ఇటుక బట్టిని తొలగించాలి

● ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ



నవతెలంగాణ-జైపూర్

ముదిగుంటలోని ఎంఎస్‌వీ ఇటుక బట్టి వెదజల్లుతున్న కాలుష్యం అనారోగ్యానికి గురి చేస్తోందని వెంటనే ఆ ఇటుక బట్టిని తొలగించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుందిల్ల మల్లేష్ మాదిగ డిమాండ్ చేశారు. ఈ సంధర్భంగా ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో బుధవారం ముదిగుంట గ్రామంలో ఇటుక బట్టి వెంటనే తొలగించాలని డిమాండ్ చేస్తూ నిరసన ర్యాలీ చేపట్టారు. ఇటుక బట్టి నుండి వెలువడుతున్న కాలుష్యం ప్రధానంగా ఎస్సీ కాలనీకి చెందిన పలువురు ఇప్పటికే శ్వాసకోష సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారని అన్నారు. ఎస్సీ కాలనీ ఇండ్ల మధ్యలో ఉన్నటువంటి ఎంఎస్‌వీ ఇటుక బట్టి వ్యర్థ కాలుష్యంతో ఇదివరకే కొంత మంది మృత్యువాతన పడ్డారని ఆవేధన వ్యక్తం చేశారు. ప్రశ్నించిన యువకులను బెదిరించడమే కాకుండా కేసులు నమోదు చేస్తామని భయభ్రాంతులకు గురి చేస్తున్నారని అన్నారు. సామాన్యులకు ప్రాణాంతకంగా మారిన ఇటుక బట్టిని వెంటనే తొలగించాని, యజమానులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో అధికారులు స్పందించకుంటే ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు గద్దల బానయ్య, జలంపల్లి శ్రీనివాస్, రామగిరి రాము, నిట్టూరి ప్రశాంత్, రామగిరి రాకేష్, ఆత్మకూర్ కిరణ్, రేగుంట నారాయణ, కోతుకంటి సుమన్, ఏముర్ల అరుణ్ పాల్గొన్నారు.

## వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దుప్పట్లు పంపిణీ



నవతెలంగాణ-తాండూర్

బెల్లంపల్లి మండలం చంద్రవెల్లి గ్రామంలోని 250 గిరిజన లంబాడి దళిత నిరుపేదలకు బుధవారం తిలక్ స్టేడియం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దుప్పట్లు పంపిణీ చేశారు. ఆల్ ఇండియా మార్వడీ యువ మోర్చ వారి ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని చేపట్టినట్టు సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్వడీ వ్యాపారస్తులు బాలు, కృష్ణకాంత్, సోనీ తిలక్ స్టేడియం వాకర్స్ అసోసియన్ సభ్యులు పాల్గొన్నారు.

## బొమ్మ తుపాకీతో బెదిరించిన దుండగులు

నవతెలంగాణ-లక్షెట్టిపేట

పట్టణంలోని ఉత్కూర్ సమీపంలో మెరుగు లక్ష్మీరాజం అనే వ్యక్తిని ఈ నెల 10న రాత్రి ఇద్దరు గుర్తు తెలియని దుండగులు బొమ్మ తుపాకీతో బెదిరించినట్లు ఎస్ఐ పి సతీష్ తెలిపారు. బాధితుడు కరీంనగర్ చౌరస్తాలోని మారుతి వైన్స్‌లో క్యాషియర్‌గా పనిచేస్తాడు. ఆదివారం రాత్రి 10.30 గంటలకు పని ముగించుకొని ఉత్కూర్ చౌరస్తాలో ఉండే తన యజమానికి డబ్బులు అప్పజెప్పడాని బైక్‌పై వచ్చి ఇంటి ముందు బండి ఆపగానే ముసుగు ధరించిన ఇద్దరు వక్తులు వెనకాల బొమ్మ తుపాకీ పెట్టి బెదిరించగా బాధితుడు అరస్తూ ఓనర్ ఇంట్లోకి పరిగెత్తడంతో దుండగులు పారిపోయారని బాధితుడు పిర్యాదు చేయగా కేసు నమోదు చేయడంతో కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
గురువారం | నవంబర్ 14, 2024 | www.navatelangana.com

## రాంనగర్ కాలనీ అభివృద్ధికి కృషి చేస్తాం

నవతెలంగాణ-జన్నారం



మండలంలోని పొన్కల్ మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని రాంనగర్ కాలని అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని మాజీ జడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో రాంనగర్ కాలనీవాసులు జడ్పీటీసీని మర్యాదపూర్వకంగా కలిసి కాలని సమస్యలను వివరించారు. కాలనీలో నెలకొన్న సమస్యలు పరిష్కరిస్తే భవిష్యత్తులో తమ వెంట నడుస్తామన్నారు. కార్యక్రమంలో రాంనగర్ కాలనీవాసులు సిలువేరు సుధీర్ కుమార్, పోతు సురేష్, కనికారపు గంగాధర్, మధిర సురేందర్ పాల్గొన్నారు.

## విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెట్టాలి

● జెడ్పీ సీఈఓ గణపతి

నవతెలంగాణ-జైపూర్



వసతీ గృహాల్లో చదువుకుంటున్న విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం పెట్టాలని జడ్పీ సీఈఓ గణపతి అన్నారు. స్థానిక ఎంపీడీఓ సత్యనారాయణతో కలిసి బుధవారం మండల కేంద్రంలో గల కస్తూరిబా పాఠశాలతో పాటు సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలను సంధర్శించారు. ఆహార పదార్థాలు స్వయంగా పరిశీలించారు. పాఠశాల పరిసరాలను పరిశీలించిన ఆయన పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. అనంతరం మండలంలో కొనసాగుతున్న సర్వే పరిశీలించి పలు సూచనలు చేశారు.

## శిక్షణతోనే ఉజ్వల భవిష్యత్తు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రభుత్వం నేషనల్ కన్స్ట్రక్షన్ అకాడమీ ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికులకు అందించిన ఉచిత నైపుణ్య శిక్షణతో ఉజ్వల భవిష్యత్తు లభిస్తుందని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బాలకిషన్, మండల అధ్యక్షులు కమలాకర్, దూడల అశోక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని భవన నిర్మాణ కార్మిక సంఘ కార్యాలయంలో ఎన్ఏసీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత నైపుణ్య శిక్షణ ముగింపు సందర్భంగా మాట్లాడుతూ కార్మికులకు శిక్షణ భవిష్యత్తులో ఎంతో ప్రయోజనం చేకూరుస్తుందన్నారు. ఈ సందర్భంగా ఎన్ఏసీ శిక్షకులు శంకర్ మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులకు 15 రోజుల పాటు శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. ఇప్పటివరకు జిల్లాలో 100 మంది ఉచిత నైపుణ్య శిక్షణను పూర్తి చేసుకున్నారని పేర్కొన్నారు. పనిలో మెలుకువలు తదితర అంశాలపై శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి త్వరలోనే ధ్రువీకరణ పత్రాలను అందజేస్తామన్నారు. శిక్షణ పూర్తి చేసుకుని ధ్రువీకరణ పత్రం పొందిన వారు విదేశాల్లో, ఇతర గుర్తింపు పొందిన ప్రభుత్వ సంస్థల్లో వృత్తిపరంగా గుర్తింపు లభిస్తుందన్నారు. శిక్షణ పొందిన వారికి స్టైఫండ్, హెల్మెట్, డ్రెస్ కోడ్, స్టేషనరీ అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు రామచందర్, ఆనందరావు, మనోహర్, సదయ్య, భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

## వసతిగృహ సమస్యలను పరిష్కరించాలి

● ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి కిరణ్

నవతెలంగాణ-ఉట్నూర్

ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల వసతి గృహంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర సహాయ కార్యదర్శి కిరణ్ డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వసతి గృహాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంగా ఉన్న ఉట్నూర్‌లో బాలికల వసతి గృహంలో అనేక సమస్యలతో విద్యార్థులు సతమతమవుతున్నారని తెలిపారు. అమ్మాయిల వసతి గృహంలో మరుగుదొడ్లు సరిగా లేకపోవడం ఇబ్బందులు పడుతున్నారన్నారు. మెస్, కాస్మొటిక్ చార్జీలు పెరిగిన తర్వాత కూడా విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడంలో వార్డెన్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. గదులలో ఫ్యాన్లు, విద్యుత్, తాగునీరు సరిగాలేదన్న విషయాలు తమ దృష్టికి వచ్చాయన్నారు. ప్రహరీ గోడను నిర్మించలేకపోవటం వల్ల కోతులు విద్యార్థినులపై దాడి చేస్తున్నాయన్నారు. అధికారులు ఈ సమస్యలను పరిష్కరించాలనీ లేని పక్షంలో ఉద్యమాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కోకన్వీనర్ సాయి, బొలిరాం పాల్గొన్నారు.

## జైనూర్ ఏఎంసీ కమిటీకి సన్మానం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలోని జైనూర్ మార్కెట్ కమిటీ నూతన కమిటీని ప్రభుత్వం ప్రకటించగా చైర్మన్ కుడుమేత విశ్వనాథ్‌తో పాటు ఇతర డైరెక్టర్లను జిల్లా కేంద్రంలోని తన నివాసంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు విశ్వ ప్రసాద్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ కోసం పని చేసే వారికి గుర్తింపు లభిస్తుందన్నారు. దీనికి నిదర్శనం విశ్వనాథ్ అని కొనియాడారు. ప్రభుత్వం నూతన కమిటీ సభ్యులపై పెట్టిన బాధ్యత సరిగ్గా నిర్వర్తించాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అనిల్ గౌడ్, శేషారావు, ఆసిఫాబాద్ మండల అధ్యక్షులు మసాడే చరణ్, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షులు ఆసిఫ్ అలీ, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు రఫిక్, జమీర్, చునర్కర్ దీపక్ పాల్గొన్నారు.

## నేటి నుండి గ్రంథాలయ వారోత్సవాలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో ఈనెల 14 నుండి 20 వరకు జాతీయ గ్రంథాలయ వారోత్సవ వేడుకలు నిర్వహించనున్నట్లు జిల్లా గ్రంథాలయ కార్యదర్శి సరిత పేర్కొన్నారు. 14న జవహర్ లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకొని ప్రారంభ కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని, 15న పుస్తక ప్రదర్శన, 16న పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు, 17న కవి సమ్మేళనం, 18న పాఠశాల విద్యార్థులకు పాటల పోటీలు నిర్వహిస్తామన్నారు. 19న మహిళా దినోత్సవ సందర్భంగా పాఠశాల విద్యార్థినులకు రంగోలీ, మెహేంది, ముగ్గుల పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. చివరి రోజు 20న బహుమతుల ప్రధాన ఉత్సవం ఉటుందన్నారు.

## ఎమ్మెల్సీగా గెలిపిస్తే సమస్యల పరిష్కారానికి కృషి

● ఎమ్మెల్సీ అభ్యర్థి డా.వి.నరేందర్ రెడ్డి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రతి నిత్యం ప్రజల్లో ఉంటూ ప్రజల, నిరుద్యోగులు, పట్టభద్రుల సమస్యలను తెలుసుకొని వాటిని పరిష్కరించే దిశగా తాను ప్రయత్నిస్తానని కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ నియోజకవర్గ ఎమ్మెల్సీ అభ్యర్థిగా డా.వి.నరేందర్ రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని ఓ ప్రయివేట్ గార్డెన్‌లో నిర్వహించిన సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర సెమినార్‌కు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా ఆయనకు గుస్సాడీ నృత్యాలతో స్వాగతం పలికారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యారంగంలో ఎన్నో సమస్యలు నెలకొని ఉన్నాయని వాటిని పరిష్కరించే దిశగా కృషి చేస్తామని భరోసా ఇచ్చారు. మార్చ్ నెలలో ఎన్నికలుంటాయని పార్టీలు కులాలకు అతీతంగా తనకు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో ఆయా విద్యాసంస్థల చైర్మన్‌లు, ఆయా పాఠశాలల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, పట్టభద్రులు పాల్గొన్నారు.

## జాతీయ సాధన సర్వేలో ఉత్తమ ఫలితాలు సాధించాలి

**ఆసిఫాబాద్ :** జాతీయ సాధన సర్వేలో జిల్లా ఉత్తమ ఫలితాలు సాధించేలా చూడాలని జిల్లా విద్యాశాఖ అధికారి యాదయ్య తెలిపారు. జిల్లా కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో అన్ని పాఠశాలలో ప్రధానోపాధ్యాయులతో నాస్‌పై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డిసెంబర్ 4న జాతీయ సాధన సర్వే పరీక్ష 3, 6, 9వ తరగతుల విద్యార్థులకు నిర్వహించడం జరుగుతుందని, విద్యార్థులను భాష, గణితం, సామాన్య, సాంఘిక శాస్త్రాలలో అభ్యసన ఫలితాలు సాధించేలా, అభ్యసన ప్రదీపికలను ఉపయోగించుకోవాలన్నారు. విద్యార్థులకు చదివిన అంశాలు అవగాహన అయ్యేలా చూడాలని, అభ్యసన ఫలితాల ఆధారంగా రకరకాల ప్రశ్నలు వేస్తూ విద్యార్థులతో సాధన చేయిస్తూ జాతీయ సాధన సర్వేకు విద్యార్థులను పూర్తి సన్నద్ధం చేయాలన్నారు. పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించేలా రేపటి నుంచి ప్రత్యేక తరగతులు నిర్వహించాలని, సకాలంలో పదవ తరగతి పాఠ్యాంశాలు పూర్తి చేయాలని, మండల విద్యాశాఖ అధికారులు ప్రతిరోజు రెండు పాఠశాలలు సందర్శించాలని, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు వారానికి నాలుగైదు సందర్శించి విద్యార్థుల అభ్యసన ఫలితాలు పరీక్షించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉమ్మడి పరీక్షల విభాగం కార్యదర్శి వెంకటేశ్వర స్వామి, జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి ఉప్పులేటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

# అభివృద్ధికి అడ్డు బీజేపీ, బీఆర్ఎస్ నాయకులే

నవతెలంగాణ-మంచిర్యాల



బీజేపీ, బీఆర్ఎస్ నాయకులే మంచిర్యాల నియోజకవర్గ అభివృద్ధికి అడ్డు పడుతున్నారని కాంగ్రెస్ నాయకులు అన్నారు. బుధవారం ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్ కు సూచించారు. రఘునాథ్ ఎమ్మెల్యేపై తప్పుడు ఆరోపణలకు స్వస్తి పలకకపోతే మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావులాగానే రాజకీయ సమాధి తప్పదన్నారు. ఎమ్మెల్యేకు చట్టంపై, ప్రభుత్వ నిబంధనలపై గౌరవం ఉందని తెలిపారు. ఎమ్మెల్యే ఇంజనీర్ లా వ్యవహరిస్తున్నాడని విమర్శలు చేయడం తగదని దుయ్యబట్టారు. ఎమ్మెల్యే ఏ వన్ కాంట్రాక్టర్‌గా పని చేసిన అనుభవం ఉందన్నారు. ఓటు వేయలేదనే అక్కసుతో మార్కెట్ రోడ్డులో కూల్చివేతలు చేస్తున్నారనే ఆరోపణలు వాస్తవం లేదన్నారు. ఓట్లు ఎవరికి వేశారో ఎలా తెలుస్తుందని ప్రశ్నించారు. రోడ్డుపై అక్రమ నిర్మాణాలు ఉన్నందునే వాటిని తొలగిస్తున్నారని తెలిపారు. శ్రీరాంపూర్‌లో పది ఎకరాల స్థలంలో డంప్ యార్డు నిర్మాణం కోసం అటవీశాఖ అనుమతుల కోసం ప్రయత్నిస్తున్నారని చెప్పారు. 63వ జాతీయ రహదారి నిర్మాణం మాస్టర్ ప్లాన్ మార్పు వెనుక రఘునాథ్ హస్తం ఉందని అదే పనిపై పలుమార్లు ఢిల్లీ వెళ్లాడని ఆరోపించారు. సమావేశంలో మంచిర్యాల, నస్పూర్ మున్సిపల్ చైర్మన్‌లు రావుల ఉప్పలయ్య, సూరమల్ల వేణు, పట్టణ అధ్యక్షుడు తూముల నరేష్ పాల్గొన్నారు.

# కొనసాగుతున్న సీఎస్ఆర్ పనులు

● ఎస్టీపీపీ ఈడీ ఎన్వీ రాజశేఖర్‌రావు

నవతెలంగాణ-జైపూర్



సీఎస్ఆర్ నిధులతో చేపట్టిన పనుల కొనసాగుతున్నాయని సింగరేణి థర్మల్ విద్యుత్ ప్లాంట్ ఈడీ ఎన్వీ రాజశేఖర్ రావు తెలిపారు. సింగరేణి డైరెక్టర్(పా) వెంకటేశ్వర్‌రెడ్డి, జీఎం పర్సనల్(ఈఈ అండ్ సీఎస్ఆర్) ఆధ్వర్యంలో సింగరేణి వ్యాప్త ఏరియా జనరల్ మేనేజర్లతో బుధవారం వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. సింగరేణి వ్యాప్తంగా సీఎస్ఆర్ నిధులతో చేపట్టిన పనుల నిర్వాహణ, ప్రస్తుత పరిస్థితులపై సింగరేణి డైరెక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డి సమీక్షించారు. ఈ సంధర్భంగా 2014 నుండి 2019 మధ్య సీఎస్ఆర్ నిధులతో చేపట్టిన పనుల పురోగతి వివరించారు. అదేవిధంగా 2019 నుండి 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన పనులు, పురోగతిని వివరించిన ఆయన పనుల నిర్వాహణలో ప్రస్తుత పరిస్థితులు వెల్లడించారు. కాగా సీఎస్ఆర్ నిధులకు సంబంధించిన ప్రాజెక్టుల పని ప్రతి నెల రిపోర్టుతో పాటు ప్రతి మూడు నెలలకు సంబంధించిన రిపోర్టు అందిచాలని సూచించారు. ఈ సమావేశంలో ఎస్టీపీపీ ఈడీ రాజశేఖర్ రావుతో పాటు ఏజీఎం(సివిల్) కేఎస్ఎన్ ప్రసాద్, డీజీఎం(పర్సనల్) అజ్మీరా తుకారాం, డిప్యూటీ ఫైనాన్స్ మేనేజర్ రమేష్ పాల్గొన్నారు.

# మూడవ రోజు రసవత్తరంగా గురుకుల క్రీడలు



నవతెలంగాణ-లక్షెట్టిపేట

స్థానిక తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయంలో పదవ జోనల్ స్థాయి క్రీడలు మూడవ రోజు రసవత్తరంగా కొనసాగాయి. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారుల వివరాలను ప్రిన్సిపల్ రమకళ్యాణి ప్రకటించారు. అండర్-14 కబడ్డీ విభాగంలో సెమీ ఫైనల్‌కు కాటారం, మందమర్రి, బెల్లంపల్లి, లక్షెట్టిపేట్, అండర్-17 కబడ్డీలో చిట్యాల, చెన్నూర్, చెబ్బెన, ములుగు, వాలీబాద్ అండర్-17 నందిమేడారం, గర్రెపల్లి, లక్షెట్టిపేట్, మల్లాపూర్ జట్లు సెమీఫైనల్‌కు చేరుకున్నాయి. అండర్-19 వాలీబాల్ విభాగంలో లక్సెట్టిపేట, మల్లాపూర్, గర్రెపల్లి, మందమర్రి సెమీఫైనల్ చేరుకున్నాయి. అండర్-14 ఖోఖో విభాగంలో ప్రథమ విజేత చిట్యాల, ద్వితీయ విజేత సిర్పూర్, అండర్-17లో ప్రథమ విజేత చిట్యాల, ద్వితీయ విజేత నంది మేడారం జట్లు నిలిచాయి. అండర్-14 చెస్ విభాగంలో ప్రథమ విజేత ఎం. శ్రావణి రామగుండం, ద్వితీయ విజేత డి.మానస బెల్లంపల్లి, అండర్-17 చెస్ విభాగంలో ప్రథమ విజేత డి శ్రీహర్ష లక్షట్టిపేట్ డి గాయత్రి నంది మేడారం నిలిచారు.



# విద్యుత్ మోటార్ కాపర్ వైర్ దొంగ అరెస్ట్




నవతెలంగాణ-జైపూర్

మండల పరిధిలో వ్యవసాయ విద్యుత్ మోటర్ల నుండి కాపర్ వైర్ దొంగతనం చేస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు శ్రీరాంపూర్ సీఐ వేణు చందర్ తెలిపారు. మండల పరిధిలో వ్యవసాయ విద్యుత్ మోటర్లు ధ్వంసం చేస్తూ కాపర్ వైర్ దొంగతనం చేస్తున్న దొంగలకు సంబంధించిన వివరాలు బుధవారం వెల్లడించారు. సీసీసీ నస్పూర్‌కు చెందిన మోటం తిరుపతి, ఏవేల అంజి అను ఇద్దరు ఉల్లిగడ్డలు అమ్ముతూ గ్రామాల్లో తిరుగుతున్న క్రమంలో గ్రామ శివారుల్లో గల వ్యవసాయ బోరు బావులను గుర్తించి రాత్రి పూట విద్యుత్ మోటర్లు ధ్వంసం చేసి కాపర్ వైరు దొంగతనం చేస్తున్నట్లు తెలిపారు. దొంగతనానికి పాల్పడుతున్నట్లు గుర్తించిన మోటం తిరుపతిని బుధవారం అరెస్ట్ చేసి అతన వద్ద ఉన్న 20 కిలోల కాపర్ వైరు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కాపర్ దొంగను పట్టుకోవడంలో స్థానిక ఎస్ఐ శ్రీధర్‌తో పాటు క్రైం పార్టీ హెడ్ కానిస్టేబుల్ మల్లయ్య, మరో కానిస్టేబుల్ సదానందం చాకచక్యంగా వ్యవహరించిన తీరును సీఐ అభినందించారు.

# అండర్-17 ఎస్‌జిఎఫ్ జిల్లా స్థాయి క్రికెట్ సెలక్షన్స్

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్



జిల్లా కేంద్రంలోని లక్కీ క్రికెట్ అకాడమీలో బుధవారం జిల్లా స్థాయి 68వ అండర్-17 ఎస్‌జిఎఫ్ జిల్లా స్థాయి క్రికెట్ సెలక్షన్స్ నిర్వహించారు. దీనికి మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్ ముఖ్యాతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. క్రీడల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు స్పోర్ట్స్ కోటాలో పైచదువులకు, ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడానికి ప్రభుత్వం రెండు శాతం రిజర్వేషన్ కల్పించిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేసి వివిధ రకాల క్రీడాకారులకు ఉచితంగా వసతి, శిక్షణ కల్పిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ గండ్రత్ రమణ, ఒలంపిక్ అసోసియేషన్ జిల్లా కన్వీనర్ శ్రీధర్‌రెడ్డి, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెక్రటరీ రవీందర్‌గౌడ్ , వైవి రమణారావు, కోచ్ సుదర్శన్, జిల్లా స్థాయి క్రికెట్ సెలక్షన్స్ ఆర్గనైజర్, సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు ఎం.శ్రీనివాస్, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## వంటచెరుకు కోసం వెళ్లే కొట్టారు..

నవతెలంగాణ-జన్నారం



మండలంలోని పుట్టిగూడ గ్రామానికి చెందిన శత్రాజుల లక్ష్మణ్ వంటచెరుకు కోసం అటవికి వెళ్లిన తనను అటవీ అధికారులు చితకబాదారని బాధితుడు విలేకరులతో తన గోడు వెళ్లబోసుకున్నాడు. బుధవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌కు వచ్చిన వివరాలు తెలిపారు. బాదంపల్లికి చెందిన జాడి రాజం వద్ద కూలీగా పనిచేస్తున్న లక్ష్మణ్ ఈ నెల 9న పొయ్యిల కట్టెల కోసం వెళ్లినట్లు తెలిపారు. అడవిలో కట్టెల బండిని అటవి అధికారులు పట్టుకున్నారని తెలిపారు. బుధవారం తెల్లవారుజామున 3 గంటలకు ఇంటికి వచ్చి తనను తీసుకెళ్లి తీవ్రంగా కొట్టారని ఆరోపించాడు. తర్వాత తహసీల్దార్ వద్దకు తీసుకెళ్లారని అన్నారు. అటవి అధికారులతో తనకు ప్రాణహాని ఉందని, వారి నుంచి రక్షించాలని లక్ష్మన్ వేడుకున్నాడు. ఈ మేరకు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశానని తెలిపారు.

## కలప అక్రమ రవాణా చేస్తున్న ఇద్దరి బైండోవర్



నవతెలంగాణ-జన్నారం

మండలంలోని పుట్టిగూడ గ్రామానికి చెందిన చేతరాజీ లక్ష్మణ్, చింతగూడ గ్రామానికి చెందిన పానగంటి శ్రీనివాస్‌ను కలప అక్రమ రవాణా చేస్తున్నారని బుధవారం సాయంత్రం తహసీల్దార్ రాజమనోహర్‌రెడ్డి ముందు బైండోవర్ చేసినట్లు ఎఫ్ఆర్ఓ సుష్మారావు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ఇద్దరు వ్యక్తులు గతంలో ఎన్ని సార్లు చెప్పినా, కలప అక్రమ రవాణా మానా లేదన్నారు. సెక్షన్ 126 ప్రకారం వారిని తహసీల్దార్ ముందు బైండోవర్ చేశామన్నారు.

## ధర్మ సమాజ్ పార్టీ మండల కమిటీ ఎన్నిక



నవతెలంగాణ-బజార్‌హత్నూర్

ధర్మసమాజ్ పార్టీ మండల కమిటీని ఆ సంఘం జిల్లా అధ్యక్షులు గణేష్ ఆధ్వర్యంలో బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షలుగా సర్కిల్ నరేష్, ఉపాధ్యక్షుడు పెంట సుధాకర్, సభ్యులుగా సర్కిల్ తరుణ్, పోతరాజు రవి ఎన్నికయ్యారు. మండల పూర్తి స్థాయి కమిటీ, వివిధ గ్రామాల కమిటీలను త్వరలో ప్రకటిస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎన్నికైన మండల అధ్యక్షులు మాట్లాడుతూ పార్టీ బలోపేతం కోసం ఎల్లవేళలా కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల ఇన్చార్జి వెంకటేష్ పాల్గొన్నారు.

## టీజీబీ ఆధ్వర్యంలో రోడ్ షో



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఆదిలాబాద్ మెయిన్ బ్రాంచ్ ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలో రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంకు రీజినల్ మేనేజర్ డి.ప్రభుదాస్ మాట్లాడుతూ బ్యాంకు ద్వారా గృహ నిర్మాణం, వ్యాపారం, వాహన కొనుగోలుపై రుణాలు పొందవచ్చని సూచించారు. కార్ లోన్ తీసుకున్న రుణ గ్రహీతకు కీ అందించి శుభాకాంక్షలు తెలిపారు. వివిధ రుణాలు పొందేందుకు తమ పేర్లను నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో బ్యాంక్ అధికారులు అభిదుల్లా, రవిచందర్, వెంకటస్వామి, రాజేష్ ఖన్నా, సుబ్బారావు, దేవి, శ్రావణి పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్‌తో బాలుడు మృతి

నవతెలంగాణ-మంచిర్యాల

పట్టణంలోని అశోక్ రోడ్‌కు చెందిన మహమ్మద్ మోహిన్(16) మంగళవారం రాత్రి విద్యుత్ షాక్‌తో మృతి చెందినట్లు పట్టణ ఎస్ఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు. వివరాల ప్రకారం రాత్రి సమయంలో ఇంట్లోని బాత్రూంలో విద్యుత్ బల్బు పనిచేయకపోవడంతో హోల్డర్‌ను సరి చేసే క్రమంలో విద్యుత్ షాక్ తగిలింది. గమనించిన కుటుంబ సభ్యులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించే క్రమంలో మృతి చేందినట్లు వైద్యులు సీపీఆర్ అందించినా ఫలితం లేకుండా పోయిందన్నారు. మృతుడి తండ్రి షరీఫ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.